సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
గురువారం, 16.04.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 174
పేజీలు: 12 వెల: రూ. 5


## భూ సేకరణ ఆపేవరకు ఉద్యమం

వికారాబాద్ ఆర్డీవో ఆఫీస్ ఎదుట కల్వకుంట్ల కవిత, విశారదన్ మహరాజ్ ధర్నా

- పోలీసులు, రైతుల తోపులాట
- అమాయక రైతుల నోటికాడి బుక్క లాక్కోవద్దు
- కలెక్టర్ స్పష్టమైన హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తాం
- నడిఎండలో నాలుగు గంటలకు పైగా బైఠాయింపు
- కవిత, విశారదన్ అరెస్ట్.. బంటారం పీఎస్‌కు తరలింపు
- మీడియా కెమెరాలు లాక్కున్న పోలీసులు

09




## టార్గెట్ పోలవరం

### సమీక్ష నిర్వహించిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు

- నీటి భద్రత కోసం జలధార యాక్షన్ ప్లాన్
- పోలవరం నీటి వినియోగంపై ముందే ప్రణాళిక
- నేరడి బ్యారేజ్, చింతలపూడి మెయిన్ కెనాల్‌కు త్వరలో టెండర్లు
- జూన్ చివరి కల్లా వెలిగొండ స్టేజ్-1 పనులు పూర్తవ్వాలని ఆదేశం

10





## టీడీపీలో కీలక శక్తిగా లోకేష్

### టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకం



- పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీల ప్రకటన
- పాత, కొత్త కలయికతో పొలిట్ బ్యూరో
- పార్టీ విధేయత, కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు
- సీనియర్లుకు గౌరవం, యువతకు ఛాన్స్

10




## దక్షిణ సారథి..

### డిలిమిటేషన్‌పై రేవంత్ హైబ్రిడ్ మోడల్‌పై జాతీయస్థాయిలో చర్చ

- దక్షిణ రాష్ట్రాల హక్కుల కోసం రేవంత్ గళం
- జనాభా ప్రమాణానికి ప్రత్యామ్నాయం చూపిన తెలంగాణ సీఎం
- దక్షిణం-ఉత్తరం సమతుల్యం కోసం 50.50 ఫార్ములా ప్రతిపాదన
- ప్రాంతీయ సమస్యను జాతీయ స్థాయికి తీసుకెళ్లిన రేవంత్
- మహిళా రిజర్వేషన్ అంశంతో కేంద్రంపై ఒత్తిడి పెంచిన సీఎం
- రేవంత్ ప్రతిపాదనకు దక్షిణాది నుంచి విస్తృత మద్దతు
- బీఆర్ ఎస్ కూడా మద్దతు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

కేంద్రం చేపట్టిన డిలిమిటేషన్ ప్రక్రియ కాంగ్రెస్ కు ఆయుధంలా మారుతోంది. జాతీయ స్థాయిలో ఎలా ఉన్న.. సీఎం రేవంత్ కు మాత్రం ఇప్పుడు కీలకపాత్ర పోషించేలా మారింది. దీంతోజాతీయ రాజకీయాల్లో రేవంత్ మార్క్ చూపిస్తున్నారు. హైబ్రిడ్ మోడల్‌తో కాంగ్రెస్ తరపున జాతీయ స్థాయి వాయిస్ వినిపిస్తున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రస్తుతం దక్షిణాది గళంగానే కాకుండా, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి ఒక బలమైన వ్యూహకర్తగా అవతరిస్తున్నారు. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, సమస్యలకు పరిష్కార మార్గాలను చూపడం ద్వారా ఆయన తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. తాజాగా ఆయన తెరపైకి తెచ్చిన హైబ్రిడ్ మోడల్ జాతీయ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు తెరలేపింది.

**హైబ్రీడ్ మోడల్ తో నేషనల్ లీడర్‌గా రేవంత్**

దేశ రాజకీయాల్లో ఇప్పుడు అందరి దృష్టి తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిపై పడింది. నియోజకవర్గాల పునర్విభజన వంటి అత్యంత క్లిష్టమైన అంశంపై ఆయన ప్రతిపాదించిన హైబ్రిడ్ మోడల్ ఇప్పుడు జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి ఒక బలమైన మిగతా 02లో

# పునర్విభజన

## తెలంగాణలో ఎంపీ సీట్ల పెంపుపై చర్చ

### రాష్ట్రంలో కొత్తగా 9 లేదా 10 లోక్‌సభ స్థానాలు

- 17 నుంచి 26-27కి లోక్‌సభ సీట్లు
- హైదరాబాద్‌లో కొత్త నియోజకవర్గాలు
- డీలిమిటేషన్‌తో రాజకీయ మార్పులు
- మహిళలకు 33% రిజర్వేషన్ ప్రభావం
- జనాభా ఆధారంగా సీట్ల పునర్విభజన
- 2029లో 9 మహిళా ఎంపీలు అవకాశం


**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుతమున్న 550 నుంచి 850కి పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 81కి సవరణలు చేయనున్నారు. ఈ పునర్విభజన వల్ల తెలంగాణలో లోక్‌సభ స్థానాల సంఖ్య 17 నుంచి 26 లేదా 27కు పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా జనాభా అధికంగా ఉన్న గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కొత్త ఎంపీ స్థానాలు ఏర్పడనున్నాయి. 33 శాతం మహిళా రిజర్వేషన్ల అమలుతో.. వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణ నుంచి కనీసం 9 మంది మహిళలు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించనున్నారు.

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో చారిత్రాత్మక మార్పునకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే సంకల్పంతో పాటు, పెరిగిన జనాభాకు అనుగుణంగా ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు లోక్‌సభ స్థానాల సంఖ్యను భారీగా పెంచాలని నిర్ణయించింది. ప్రస్తుతం లోక్‌సభ గరిష్ఠ సభ్యుల సంఖ్య 550 ఉండగా.. 2011 జనాభా లెక్కల ప్రకారం.. ఆ సంఖ్యను 850కి పెంచేలా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇందులో రాష్ట్రాల వాటా 815 కాగా.. కేంద్ర పాలిత ప్రాంతాలకు 35 స్థానాలను కేటాయించనున్నారు.

ఈ పునర్విభజన బిల్లు ప్రక్రియ వల్ల తెలంగాణ రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలు ఉండగా.. కొత్త లెక్కల ప్రకారం ఇవి 26 లేదా 27కు పెరిగే అవకాశముంది. అసెంబ్లీ స్థానాలు ప్రస్తుతం 119 ఉండగా.. అదనంగా 60 సీట్లతో 179కి చేరే అవకాశం ఉంది. 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుంటే.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జనాభా పరంగా దేశంలోనే 17వ స్థానంలో ఉంది. ఫలితంగా గ్రేటర్ హైదరాబాద్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లోనే అదనంగా 3 నుంచి 4 కొత్త లోక్‌సభ స్థానాలు ఏర్పడనున్నాయి. దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గంగా ఉన్న మల్కాజిగిరితో పాటు సికింద్రాబాద్, హైదరాబాద్, భువనగిరి స్థానాలను విభజించి కొత్త నియోజకవర్గాలను ఏర్పాటు చేయనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలను విభజించి అదనంగా మరో రెండు స్థానాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న మెదక్, జహీరాబాద్‌లకు తోడు మరొక కొత్త స్థానం రానుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ విభజన ద్వారా అదనంగా ఒక స్థానం ఏర్పడనుంది. ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో ఒకటి లేదా రెండు కొత్త స్థానాలు వచ్చే సూచనలున్నాయి.

మిగతా 02లో




## రాజీపడం

### దక్షిణాది రాష్ట్రాల హక్కులపై కేసీఆర్ గట్టి హెచ్చరిక

- మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ పూర్తి మద్దతు
- డీలిమిటేషన్‌పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన కేసీఆర్
- దక్షిణ రాష్ట్రాల ఎంపీ సీట్ల శాతం తగ్గకూడదని డిమాండ్
- జగిత్యాల సభ, పార్టీ ఆవిర్భావ వేడుకలకు భారీ ప్లాన్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కేంద్రానికి స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొస్తున్న చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని అయన ప్రకటించారు. తాము అధికారంలో మిగతా 02లో






## ఇటు రేవంత్.. అటు కేసీఆర్..

03

### ఉమ్మడి కరీంనగర్‌లో పొలిటికల్ హీట్

- కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిశీలించనున్న రేవంత్
- జగిత్యాలలో జీవన్ రెడ్డి సభకు హాజరుకానున్న కేసీఆర్
- ప్రజాసభలో కీలక సందేశం ఇవ్వనున్న ముఖ్యమంత్రి
- రెండున్నరేళ్ల తర్వాత ప్రజల్లోకి గులాబీ దళపతి
- ప్రముఖ నేతల పర్యటనలతో మరింత ఆసక్తి





ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పొలిటికల్ అగ్గిరాజేస్తూ.. ఒకే రోజు ఇద్దరు దిగ్గజాలు కదనరంగంలోకి దిగుతున్నారు. కాళేశ్వరం వైఫల్యాలను ఎండగట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధమవుతుంటే.. రెండేళ్ల మౌనాన్ని వీడి జగిత్యాల వేదికగా గర్జించేందుకు గులాబీ దళపతి కేసీఆర్ వస్తున్నారు. ఒకరు 'ప్రాజెక్టు' విచారణతో ఉచ్చు బిగిస్తుంటే, మరొకరు 'ప్రజా గళం'తో ఎదురుదాడికి ప్లాన్ చేస్తున్నారు. 20న జిల్లాలో ఎండల కంటే రాజకీయ వేడినే ఎక్కువగా ఉండబోతోంది!

-ముద్ర, కరీంనగర్

## నామినేటెడ్ షురూ



కాంగ్రెస్ నేతలకు పదవుల జాతర

నామినేటెడ్ పోస్టుల భర్తీకి సన్నాహాలు పూర్తి

10

## మండుతున్న ఎండలు..

### నిప్పుల కొలిమిలా తెలంగాణ


- 42 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు..
- మందుబాబుల చూపు 'బీరు' వైపు!

**ముద్ర డెస్క్ :**

తెలుగు రాష్ట్రాల్లో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఏప్రిల్ నెల మధ్యలోనే ఎండలు దంచికొడుతున్నాయి. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. ఆకాశం నుంచి నిప్పులు కురుస్తున్నాయా అన్నట్లుగా ఎండల తీవ్రత పెరుగుతుండటంతో జనం విలవిలలాడుతున్నారు.

**ఉడికిపోతున్న జిల్లాలివే..**

వాతావరణ శాఖ నివేదికల ప్రకారం, రాష్ట్రంలోని 29 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల మిగతా 02లో



ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 16.04.2026
www.mudranews.in | @mudranews



ఎక్కువగా నీరు తాగాలి



రోజంతా తరచూ నీరు తాగడం వల్ల డీహైడ్రేషన్ తగ్గుతుంది. శరీరంలో నీటి సమతుల్యత కాపాడుతుంది.

# పునర్విభజన




(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం తెలంగాణ నుంచి లోక్‌సభలో ఇద్దరు మహిళలు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే 33 శాతం రిజర్వేషన్లు అమల్లోకి వస్తే.. 2029 ఎన్నికల నాటికి ఈ సంఖ్య కనీసం 9కి చేరనుంది. గత ఎన్నికల్లో ప్రధాన పార్టీలు మహిళలకు తక్కువ టికెట్లు కేటాయించినప్పటికీ.. భవిష్యత్తులో ప్రతి పార్టీ కచ్చితంగా 9 మంది మహిళా అభ్యర్థులను బరిలోకి దించాల్సి ఉంటుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఖమ్మం, కరీంనగర్ వంటి జిల్లాల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉండటం విశేషం. కాగా, ఈ పునర్విభజన ప్రక్రియ 2026-27 నాటి జనాభా లెక్కల ఆధారంగా జరిగే అవకాశం ఉందని.. అప్పటికి నియోజకవర్గాల సరిహద్దులు మారిపోయి సరికొత్త రాజకీయ సమీకరణాలు తెరపైకి వస్తాయని పొలిటికల్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ మార్పులు మహిళల గొంతు పార్లమెంటులో మరింత బలంగా వినిపించడానికి దోహదపడతాయని అంటున్నారు.

**కలిసి వచ్చేదెవరికి..?**

కేంద్రం ఇప్పటికే 2011 జనాభా లెక్కల ప్రకారం పునర్విభజనకు సిద్ధమైంది. దీంతో.. కొత్తగా వచ్చే ఎంపీ స్థానాలు.. రిజర్వేషన్ల పైన దాదాపు స్పష్టత వచ్చింది. 2011 జనాభా లెక్కల మేరకు నియోజకవర్గాల పెంపు జరగనుండటంతో.. కొత్త నియోజకవర్గాలపై స్పష్టత వచ్చింది. ఈ లెక్క ప్రకారం రంగారెడ్డి ఉమ్మడి జిల్లా 52,96,741 జనాభాతో రాష్ట్రంలో మొదటిస్థానంలో.. ప్రస్తుతం మల్కాజిగిరి, చేవెళ్ల, భువనగిరి, సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలు పరిధిలో విస్తరించింది.

**డీలిమిటేషన్ తో మారనున్న రాజకీయ ముఖచిత్రం**

ఇక, ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలు వేరుచేసి కొత్తగా మరో రెండు స్థానాలు ఏర్పాటు కానున్నాయి. అదే విధంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో కొత్తగా మరొక స్థానం ఏర్పాటు కానుంది. ఇక, మహబూబ్ నగర్ – నాగర్ కర్నూలును విభజించి మరో స్థానం ఏర్పాటు చేసే విధంగా కసరత్తు జరుగుతోంది. వరంగల్ – ఖమ్మం – నల్గొండ జిల్లాల పరిధిలో మరో రెండు స్థానాలు రానున్నాయి. ఇక.. మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందనుండటంతో.. రాష్ట్రంలో మహిళలకు 2029 ఎన్నికల నుంచి 9 స్థానాలు కేటాయించనున్నారు. అదే విధంగా అసెంబ్లీ స్థానాల్లోనూ మహిళలకు 55 స్థానాలు ఇవ్వాల్సి ఉంటుంది. పార్లమెంట్ లో బిల్లు ఆమోదం తరువాత కేంద్రం డీ లిమిటేషన్ కమిటీ ఏర్పాటు చేయనుంది. అభిప్రాయ సేకరణ తరువాత.. కేంద్రానికి ఇచ్చే నివేదిక.. ప్రజాభిప్రాయం తీసుకున్న తరువాత ఈ కొత్త నియోజకవర్గాలపై అధికారికంగా గెజిట్ విడుదల కానుంది. దీంతో.. ఈ డీలిమిటేషన్‌పై ఆసక్తి నెలకొంది.

# దక్షిణ సారథి..

(మొదటి పేజీ తరువాయి)

ఎజెండాను అందించింది. జనాభా ప్రాతిపదికన మాత్రమే సీట్లు పెంచితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయన్న ఆందోళన అందరిలో ఉన్నా, దానికి ప్రత్యామ్నాయం ఏమిటన్న ప్రశ్న ఎవరి దగ్గరా లేదు. ఆ శూన్యాన్ని రేవంత్ రెడ్డి తన వినూత్న ప్రతిపాదనతో భర్తీ చేశారు.

**ఏమిటీ రేవంత్ హైబ్రిడ్ మోడల్ ?**


డిలిమిటేషన్ ప్రక్రియలో కేవలం జనాభాను మాత్రమే ప్రామాణికంగా తీసుకుంటే, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోతుందనేది రేవంత్ ప్రధాన వాదన. దీనికి పరిష్కారంగా ఆయన 50:50 ఫార్ములాను ప్రతిపాదించారు. అంటే.. అదనంగా పెంచే సీట్లలో 50 శాతాన్ని జనాభా ప్రాతిపదికన, మిగిలిన 50 శాతాన్ని ఆయా రాష్ట్రాల ఆర్థిక సహకారం (జీఎస్‌డీపీ), సామాజిక అభివృద్ధి సూచికల ఆధారంగా కేటాయించాలి. ఈ మోడల్ వల్ల దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న రాష్ట్రాలకు తగిన గుర్తింపు దక్కుతుందని, అభివృద్ధి చెందినందుకు శిక్ష పడదనే భరోసా కలుగుతుందని ఆయన వివరిస్తున్నారు.

**కాంగ్రెస్‌కు దిశానిర్దేశం.. బీజేపీకి చెక్!**

గతంలో ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా తెలంగాణకు చెందిన నేతను ఖరారు చేసేలా పావులు కదిపి జాతీయ స్థాయిలో దృష్టిని ఆకర్షించిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు మరోసారి తన వ్యూహ చతురతను ప్రదర్శించారు. బీజేపీని ఢీకొట్టడంలో కేవలం భావోద్వేగాలే కాకుండా, తార్కికమైన అంశాలు అవసరమని రేవంత్ నిరూపిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాల మనోభావాలను దెబ్బతీయకుండా, అదే సమయంలో జాతీయ సమగ్రతను కాపాడేలా ఆయన చేస్తున్న వాదన కాంగ్రెస్ హైకమాండ్‌కు కూడా కొత్త ఊపిరి పోస్తోంది.

**ప్రాంతీయ సెంటిమెంట్‌ను జాతీయ ఎజెండాగా మార్చి..**

రేవంత్ రెడ్డి ఈ అంశాన్ని కేవలం తెలంగాణ సమస్యగా కాకుండా, మొత్తం దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి సమస్యగా మలిచారు. బీజేపీని ఇరకాటంలో పెట్టడానికి మహిళా రిజర్వేషన్ బిల్లు అంశాన్ని కూడా ఇందులో జోడించారు. మహిళా కోటాను డిలిమిటేషన్‌తో ముడిపెట్టడం రాజకీయ కుట్ర అని, తక్షణమే 543 స్థానాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేయడం ద్వారా కేంద్రంపై ఒత్తిడి పెంచారు. ఈ విశ్లేషణలన్నీ గమనిస్తే, రేవంత్ ఇప్పుడు కేవలం ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగానే కాకుండా, ఇండియా కూటమిలో ఒక థింక్ ట్యాంక్ గా ఎదుగుతున్నారని అర్థమవుతోంది. నియోజకవర్గాల విభజనపై క్లారిటీ లేక అయోమయంలో ఉన్న విపక్షాలకు రేవంత్ రెడ్డి మోడల్ ఒక స్పష్టమైన మార్గాన్ని చూపింది. ఈ మోడల్ లోని సాధ్యాసాధ్యాల కంటే, ఒక ప్రత్యామ్నాయాన్ని ప్రభుత్వం ముందు ఉంచడంలో రేవంత్ సక్సెస్ అయ్యారు. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల కోసం గళమెత్తే ఛాంపియన్‌గా అవతరిస్తూనే, జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీకి కొత్త వ్యూహాలను అందిస్తున్న రేవంత్ రెడ్డి భవిష్యత్తులో మరింత కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది.




**మద్దతు వస్తోంది**

మరోవైపు రేవంత్ చేపట్టిన ఈ కొత్త పోరాటానికి ఆయా రాష్ట్రాల నుంచి మద్దతు వస్తూనే ఉంది. దక్షిణ రాష్ట్రాల నుంచి బీజేపీ మినహా.. అంతా కలిసి వస్తున్నట్లే మారారు. చివరకు స్వరాష్ట్రంలో కూడా రేవంత్ ను వ్యతిరేకించే బీఆర్ఎస్ కూడా మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది. ఇది రాజకీయాల్లో రేవంత్ కు కలిసి వచ్చే అవకాశం.

# మలక్కాపై ట్రంప్ కన్ను

**భారత్‌కు కలిసొచ్చేనా?**

**అంతర్జాతీయ రాజకీయాల్లో ట్రంప్ మార్క్ వ్యూహం**

**ఇరాన్‌తో ముగియగానే చైనాకు చెక్ పెట్టే ప్లాన్**

ముద్ర డెస్క్ :

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనదైన శైలిలో అంతర్జాతీయ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేస్తున్నారు. అగ్రరాజ్య వ్యూహాలు ఇప్పుడు మధ్యప్రాచ్యం నుంచి వ్యూహాత్మక ఆసియా జలసంధుల వైపు మళ్లుతున్నాయి. ఇరాన్‌తో కొనసాగుతున్న సుదీర్ఘ ఉద్రిక్తతలకు ముగింపు పలకడంపై ఆశావహ దృక్పథాన్ని వ్యక్తం చేస్తూనే అదే సమయంలో ప్రపంచ వాణిజ్యానికి గుండెకాయ వంటి మలక్కా జలసంధిపై పట్టు సాధించే దిశగా అడుగులు వేయడం సంచలనమైంది.

**యుద్ధం ముగింపు దశలో ఉన్నా.. పట్టు వీడని అమెరికా**


టెహ్రాన్‌తో జరుగుతున్న దశాబ్దాల ఘర్షణ ఇప్పుడు ఒక కీలక మలుపునకు చేరుకుంది. ఇరాన్ ప్రస్తుతం తీవ్ర ఆర్థిక, రాజకీయ ఒత్తిడిలో ఉందని.. వారు ఒప్పందం కోసం తహతహలాడుతున్నారని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే అమెరికా తన పనిని ఇంకా పూర్తి చేయలేదని ఆయన స్పష్టం చేయడం గమనార్హం. 'ప్రస్తుతం మనం ఇరాన్ నుండి బలగాలను ఉపసంహరించుకుంటే ఆ దేశం తిరిగి కోలుకోవడానికి కనీసం 20 ఏళ్లు పడుతుంది. మేము ఏ నిర్ణయం తీసుకున్నా అది అమెరికా ప్రయోజనాలను కాపాడే విధంగానే ఉంటుంది.' అని ట్రంప్ తన వ్యూహాత్మక ఆధిపత్యాన్ని చాటుకున్నారు.

**మలక్కా జలసంధి.. కొత్త రణక్షేత్రం?**

హోర్ముజ్ జలసంధిపై పట్టు సాధించిన ట్రంప్.. ఇప్పుడు తన దృష్టిని ఆసియా వైపు మళ్లించారు. ఇండోనేషియాతో కుదిరిన తాజా రక్షణ ఒప్పందం ఇందుకు నిదర్శనం. మలక్కా జలసంధి కేవలం ఒక నీటి మార్గం కాదు.. అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రాణనాళం. చైనా తన ఇంధన దిగుమతుల్లో సుమారు 80% ఈ మార్గం ద్వారానే పొందుతుంది. మలక్కాపై అమెరికా ప్రభావం పెరిగితే అది చైనా యొక్క 'మలక్కా డైలమా'ను మరింత తీవ్రం చేస్తుంది. ఎలక్ట్రానిక్స్, చమురు, పారిశ్రామిక వస్తువుల రవాణాకు ఇది ప్రధాన మార్గం కావడం వల్ల ఇక్కడ పట్టు సాధించడం అంటే ప్రపంచ సరఫరా గొలుసును నియంత్రించడమే.

**భారత్‌కు దక్కనున్న వ్యూహాత్మక ప్రయోజనం**

అమెరికా తీసుకుంటున్న ఈ కొత్త నిర్ణయాలు భారత్‌కు భారీగా కలిసివచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం భారతదేశ భౌగోళిక స్థానం. మలక్కా జలసంధికి అత్యంత సమీపంలో ఉన్న అండమాన్ నికోబార్ దీవులు భారత్‌కు సహజసిద్ధమైన 'విమానవాహక నౌక' వంటివి. అమెరికా మలక్కాపై దృష్టి పెడితే భారత్‌తో భాగస్వామ్యం వారికి అనివార్యం. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛాయుత వాణిజ్యం కోసం భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాల కూటమి మరింత శక్తివంతంగా మారే అవకాశం ఉంది. హిందూ మహాసముద్రంలో చైనా దూకుడుకు అడ్డుకట్ట వేయడానికి భారత్‌కు అమెరికా సాంకేతికత, నిఘా సహకారం మరింత పెరగవచ్చు.




**సవాళ్లు లేకపోలేదు**

ట్రంప్ వ్యూహం భారత్‌కు అనుకూలమైనప్పటికీ కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. అమెరికా తన సొంత ప్రయోజనాల కోసం ఈ ప్రాంతంలో సైనిక మోహరింపును పెంచితే అది ప్రాంతీయ అస్థిరతకు దారితీయవచ్చు. భారత్ తన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని కాపాడుకుంటూనే అగ్రరాజ్యంతో సమతుల్యత పాటించాల్సి ఉంటుంది.

మొత్తానికి ట్రంప్ వ్యూహాలు ఇరాన్ నుంచి ఆసియా జలసంధుల వరకు విస్తరించడం ప్రపంచ రాజకీయాల్లో కొత్త శకానికి నాంది పలుకుతోంది. ఇది భారత్‌కు ఒక గొప్ప అవకాశంగా మారుతుందా లేదా కొత్త భౌగోళిక రాజకీయ సవాళ్లను విసురుతుందా అన్నది కాలమే నిర్ణయించాలి.

# రాజీపడం




(మొదటి పేజీ తరువాయి)

ఉన్నప్పుడే అసెంబ్లీలో మహిళా రిజర్వేషన్ల కోసం తీర్మానం చేశామని చెప్పారు. ఈ బిల్లుకు రాజ్యసభలో తమ ఎంపీలు మద్దతు ఇస్తారని ఆయన స్పష్టం చేశారు.

భారత ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బుధవారం ఎర్రవెల్లి నివాసంలో పార్టీ అగ్రనేతలు కేటీఆర్, హరీష్ రావులతో భేటీ అయిన ఆయన.. జాతీయ రాజకీయాల్లో రాబోయే మార్పులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగేలా ఉంటే దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని తేల్చి చెప్పారు. ప్రస్తుతం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు 24శాతం ఎంపీ సీట్లు ఉన్నాయన్న ఆయన.. భవిష్యత్తులో సీట్లు పెంచినా ఈ శాతం తగ్గకుండా చూడాలని డిమాండ్ చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ జరిగితే, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. బిల్లులోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే పార్టీ తుది నిర్ణయం తీసుకుంటుందని, అంతవరకు తొందరపడవద్దని పార్టీ నేతలకు కేసీఆర్ సూచించారు. అలాగే రాజకీయ అంశాలతో పాటు పార్టీ సంస్థాగత కార్యక్రమాలపైనా కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ, అలాగే ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కేటీఆర్, హరీష్ రావును ఆదేశించారు.

# ఎల్‌పీజీ సరఫరా కష్టమేనా?

ముద్ర డెస్క్ :

పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు కేవలం ఆ ప్రాంత సరిహద్దులకే పరిమితం కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పునాదులను కదిలిస్తున్నాయి. ముఖ్యంగా భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు జీవనాడి వంటి 'లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్' (ఎల్.పీ.జీ) సరఫరా వ్యవస్థ విచ్ఛిన్నం కావడం ఆందోళనకరం. కేంద్ర ప్రభుత్వ తాజా అంచనాల ప్రకారం.. ఈ గ్యాస్ సరఫరా వ్యవస్థ తిరిగి గాడిలో పడటానికి మరో మూడు నుంచి నాలుగు ఏళ్లు పడుతుందన్న వార్త ఇంధన భద్రతపై ముంచుకొస్తున్న ముప్పును సూచిస్తోంది.

పశ్చిమాసియాలో గ్యాస్ ఉత్పత్తి కేంద్రాలు.. నిల్వ సదుపాయాలు యుద్ధ జ్వాలల మధ్య చిక్కుకున్నాయి. ప్రపంచ ఇంధన రవాణాకు 'మహాద్వారం' వంటి హోర్ముజ్ జలసంధిలో అనిశ్చితి నెలకొనడం పెను సంక్షోభానికి దారితీస్తోంది. అత్యంత కీలకమైన ఈ జలమార్గం గుండానే ప్రపంచంలోని మెజారిటీ చమురు.. గ్యాస్ రవాణా సాగుతుంది. ఇక్కడ ఏ చిన్న అంతరాయం కలిగినా దాని ప్రభావం గ్లోబల్ మార్కెట్‌పై సునామీలా విరుచుకుపడుతోంది.

భారత్ పరిస్థితి మరింత సున్నితంగా ఉండటానికి ప్రధాన కారణం మనం దిగుమతులపై చూపుతున్న అమితమైన ఆధారపడటమే. దేశవ్యాప్తంగా వంట గ్యాస్ అవసరాల్లో 60 శాతానికి పైగా దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. ఇందులో 90 శాతం వాటా ఒక్క హోర్ముజ్ జలసంధి మార్గం ద్వారానే రావడం గమనార్హం. అంటే పశ్చిమాసియాలో తుమ్మినా మన దేశంలో గ్యాస్ పొయ్యి వెలగని పరిస్థితి ఏర్పడింది. రూబిక్స్ డేటా సైన్సెస్ నివేదిక హెచ్చరించినట్లుగా సరఫరాలో 40 నుంచి 50 శాతం లోటు ఉందంటే అది గృహ వినియోగదారులకే కాక పారిశ్రామిక రంగానికి కూడా గొడ్డలిపెట్టు వంటిదే.

ప్రస్తుత సంక్షోభం మనకు ఒక గట్టి హెచ్చరిక. కేవలం ఒకే ప్రాంతంపై లేదా ఒకే సరఫరా మార్గంపై ఆధారపడటం ఎంతటి ప్రమాదకరమో ఇప్పుడు స్పష్టమైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తన వ్యూహాలను యుద్ధ ప్రాతిపదికన మార్చుకోవాలి. రష్యా, అమెరికా లేదా ఆఫ్రికా దేశాల నుంచి దిగుమతులను విభిన్నీకరించడం తక్షణ అవసరం. అలాగే దేశీయంగా గ్యాస్ ఉత్పత్తిని పెంచడంతో పాటు 'బయో గ్యాస్', 'గ్రీన్ హైడ్రోజన్' వంటి ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు ప్రజలను, పరిశ్రమలను మళ్లించడంలో ఇక ఏమాత్రం జాప్యం చేయకూడదు.

వనరుల లభ్యత కంటే సరఫరా గొలుసు పటిష్టత ఇప్పుడు అత్యంత ముఖ్యం. రాబోయే మూడు నాలుగేళ్లు గడ్డు కాలమని అర్థమవుతున్న వేళ ప్రభుత్వం నిల్వ సామర్థ్యాలను పెంచడంపై దృష్టి పెట్టాలి. వినియోగదారులు కూడా ఇంధన పొదుపును బాధ్యతగా స్వీకరించాలి. యుద్ధాలు ఎప్పుడు ముగుస్తాయో ఎవరూ ఊహించలేరు.. కానీ ఆ ప్రభావం మన వంటింటి వరకు చేరకుండా చూసుకోవడం మాత్రం మన దౌత్య, ఆర్థిక వ్యూహాలపైనే ఆధారపడి ఉంటుంది. పశ్చిమాసియా చిచ్చును ఒక పాఠంగా మార్చుకుని, ఇంధన స్వయంసమృద్ధి వైపు అడుగులు వేయడమే భారత్ ముందున్న ఏకైక మార్గం.



# మండుతున్న ఎండలు

(మొదటి పేజీ తరువాయి)

సెల్సియస్ దాటి నమోదయ్యాయి. ఉదయం 8 గంటల నుంచే ఎండ వేడి మొదలవుతుండగా, మధ్యాహ్నం వేళ బయటకు రావాలంటేనే ప్రజలు వణికిపోతున్నారు. రానున్న 3 రోజులు కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుందని, పలు జిల్లాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని.. ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

**అడవి దేవులపల్లిలో అత్యధికం..**

రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే, ఉమ్మడి నల్గొండ జిల్లాలోని అడవి దేవులపల్లి మండలంలో అత్యధికంగా 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీనితో పాటు జగిత్యాల జిల్లా కోరుట్లలో 43.4డిగ్రీలు, నిర్మల్ జిల్లా దస్తూరాబాద్, నిజామాబాద్ జిల్లా భీంగల్‌లో 43.3 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలో 43 43.2 డిగ్రీల మేర ఎండ తీవ్రత ఉంది. రాజధాని హైదరాబాద్లో సైతం సాధారణం కంటే 2.8 డిగ్రీలు అదనంగా ఉష్ణోగ్రత పెరిగి, ప్రజలను ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

**వేసవి తాపం.. బీరుతో చిల్!**

ఒకవైపు ఎండలు మండిపోతుంటే, మరో వైపు ఈ వేడిని తట్టుకునేందుకు 'మందుబాబులు' కొత్త దారి వెతుక్కున్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు అంతా బీర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో బీర్ల అమ్మకాలు మునుపెన్నడూ లేని విధంగా పెరిగాయి. డిమాండ్‌కు అనుగుణంగా బ్రూవరీస్ ఇబ్బడిముబ్బడిగా బీర్లను సరఫరా చేస్తున్నాయి. "కొట్టు గురూ.. కూల్ గుడూ" అంటూ మందుబాబులు వైన్ షాపుల వద్ద క్యూ కడుతున్నారు. ఎక్కువగా నీళ్లు తాగడం, గొడుగులు వాడటం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
16.04.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### వేసవి అలెర్ట్ : మట్టికుండ నీరు ఉపయోగించాలి

మట్టికుండలోని నీరు సహజంగా చల్లగా ఉంటుంది. ఇది శరీ-రానికి హానికరం కాకుండా దాహం తీర్చుతుంది.



# ఇటు రేవంత్..అటు కేసీఆర్

- ఉమ్మడి కరీంనగర్‌లో పొలిటికల్ హీట్

**ముద్ర, కరీంనగర్:**



ఉమ్మడి కరీంనగర్ జిల్లా వేదికగా తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల అగ్రనేతలు ఒకే రోజు జిల్లాలో పర్యటిస్తుండటంతో రాజకీయ వాతావరణం ఉత్కంఠగా మారింది. ఈ నెల 20వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు పర్యటనలు ఖరారు కావడంతో అటు అధికార యంత్రాంగం, ఇటు రాజకీయ వర్గాల్లో భారీ చర్చ నడుస్తోంది.

**కాళేశ్వరంపై సీఎం రేవంత్ గురి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 20న కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీని సందర్శించనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలు, పిల్లర్లు కుంగిపోయిన అంశాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రధాన ఆయుధంగా వాడుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు స్వయంగా ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి ప్రాజెక్టును సందర్శించి, పునరుద్ధరణ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. అలాగే, గోదావరి వద్ద జరగనున్న సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లను కూడా ఆయన పర్యవేక్షించనున్నారు. అనంతరం అక్కడ నిర్వహించే భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించనున్నారు.

**జగిత్యాలలో గులాబీ దళపతి 'గర్జన'**

మరోవైపు, దాదాపు రెండున్నరేళ్ల విరామం తర్వాత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రజల ముందుకు వస్తున్నారు. జగిత్యాలలో జరగనున్న భారీ బహిరంగ సభకు ఆయన హాజరుకానున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరుతున్న తరుణంలో, కేసీఆర్ స్వయంగా ఆయనను పార్టీలోకి ఆహ్వానించనున్నారు. ఈ సభ ద్వారా కేసీఆర్ తన కేడర్‌లో జోష్ నింపడంతో పాటు, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలపై కీలక సందేశం ఇచ్చే అవకాశం ఉంది.

**ఆసక్తి రేపుతున్న 'ఏప్రిల్ 20'**

రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్న తరుణంలో, రాజకీయ సభలు కూడా అంతే వేడిని కలిగిస్తున్నాయి. ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి ఇద్దరూ ఒకే ప్రాంతంలో (ఉమ్మడి కరీంనగర్) పర్యటిస్తుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ రేవంత్ పర్యటన సాగుతుంటే, జగిత్యాల సభ ద్వారా తన బలాన్ని నిరూపించుకోవాలని కేసీఆర్ భావిస్తున్నారు. మొత్తానికి, ఏప్రిల్ 20న జరిగే ఈ హై-ప్రొఫైల్ పర్యటనలతో తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి మార్పులు రాబోతున్నాయో వేచి చూడాలి.

# రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నాయకుడు

- మహమ్మద్ జావిద్ మృతి

**ముద్ర, ఖమ్మం:**



సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఖమ్మం నగర పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ జావిద్ (56) బుధవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఖమ్మం నుండి సూర్యాపేట రహదారి మధ్యలో పిల్లలమర్రి అనే ప్రదేశంలో కారు అదుపుతప్పి, డివైడర్ ను ఢీకొని, పల్టీ కొట్టింది. కారు నుండి రోడ్డు పక్కన స్థలంలో జావిద్ ఎగిరిపడ్డారు. అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఒక కుమార్తె లా, మరొకరు డాక్టర్ చదువుతున్నారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో జిల్లా కేంద్రమైన ఖమ్మం నగరంలో పార్టీని కాపాడుకోటమే కాకుండా కార్యకర్తలకు పెద్దదిక్కు గా నిలిచారు. జావిద్ మృతి ఆయన కుటుంబంతోపాటు కాంగ్రెస్ పార్టీలో తీవ్ర విషాదాన్ని నింపింది. కాంగ్రెస్ పార్టీలో జిల్లా సేవాదళ్ అధ్యక్షుడిగా పనిచేస్తున్నప్పటినుండి బడుగు బలహీన వర్గాల కార్యకర్తలకు, ప్రజలకు మహమ్మద్ జావిద్ తన నిస్వార్థ సేవలతో దగ్గరయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం నుండి తుమ్మల నాగేశ్వరరావు గెలుపులో కీలక పాత్ర ను పోషించారు. ఎంతో రాజకీయ భవిష్యత్తు కలిగిన జావిద్ అకాల మరణం పార్టీ కి తీరని లోటును కలిగించింది. జావిద్ మృతి పట్ల డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు, ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్సీ తాత మధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార ్లు సంతాపం, సానుభూతి ప్రకటించారు.

# కూతుర్ని చంపిన తండ్రి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**



భార్యపై కోపంతో కన్న కూతురుని చంపేశాడో కసాయి తండ్రి.. వివరాల్లోకి వెళితే.. భువనగిరి మండలంలోని హనుమపురం గ్రామానికి చెందిన ఎర్రబోయిన శ్రీరాములు పుట్టుకతో మూగ, చెవిటి వాడు. బుధవారం ఉదయం భార్య నాగమణితో ఇంట్లో గొడవపడి తన కూతురు ఎర్రబోయిన నిత్యశ్రీ (23 నెలలు) ని తన బండి పైన బలవంతంగా గ్రామ శివారులోకి తీసుకుని వెళ్ళి గొంతు నిలిమి చంపేశాడు. కొంత సమయం తర్వాత శ్రీరాములు తన అన్న రాజు కి వీడియో కాల్ చేసి నిత్యశ్రీ లేవట్లేదు అని చూపించాడు. వెంటనే అన్న రాజు నిత్యశ్రీ ని భువనగిరి జనరల్ హాస్పిటల్ కి తీసుకొని వెళ్ళగా మరణించినట్లు డాక్టర్ లు ధృవీకరించారు. భార్యపై కోపంతోనే కూతురిని తానే హత్య చేసినట్లు పోలీస్ స్టేషన్లో శ్రీరాములు లొంగిపోయాడు. బాలిక తాత మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ మిర్యాల అనిల్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

# నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వ్యతిరేకిస్తున్నాం..

- మహిళా రిజర్వేషన్ బిల్లుకు మేం మద్దతు ఇస్తున్నాం
- బిల్లు ప్రవేశపెడుతున్న విధానంపైనే మాకు అభ్యంతరం
- రాజకీయ దురుద్దేశంతో ఈ బిల్లు తెస్తున్నారు
- బిల్లుకు వ్యతిరేకంగా విపక్షాలన్నీ పోరాడుతాయి
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు



**ముద్ర, న్యూ ఢిల్లీ :**

డీలిమిటేషన్ బిల్లుకు సంబంధించి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వ్యతిరేకించాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. అయితే మహిళా రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని, రిజర్వేషన్ల అమలు కోసం కేంద్రం అనుసరిస్తున్న విధానంపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని చెప్పారు. రాజకీయ లబ్ధి కోసం కేంద్రం ప్రయత్నిస్తోందని ఖర్గే ఆరోపించారు. బుధవారం దిల్లీలోని ఖర్గే నివాసంలో ఇండియా కూటమి నేతలు సమావేశమయ్యారు. 16వ తేదీ నుంచి 3రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ప్రతిపక్ష ఇండియా కూటమి సమావేశంలో ప్రధానంగా చర్చలు జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఖర్గే విపక్షాలను దెబ్బతీయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ బిల్లులు తెస్తోందని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మేమంతా అనుకూలం. కానీ వారు దాన్ని తీసుకువచ్చిన విధానం పట్ల మాకు అభ్యంతరాలున్నాయి. ఇది పూర్తిగా రాజకీయ ప్రేరేపితం. కేవలం ప్రతిపక్ష పార్టీలను అణిచివేయడానికే ప్రభుత్వం ఇలా చేస్తోంది. మహిళా రిజర్వేషన్ బిల్లు మద్దతు ఇవ్వాలని మేమంతా నిర్ణయించాం. 2010 నుంచి 2023 వరకు రాజ్యాంగ సవరణకు అంగీకరించాం. పాత సవరణలనే అమలు చేయాలని కోరుతున్నాం. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) విషయంలో ప్రభుత్వం కొన్ని గిమ్మిక్కులు చేస్తోంది. పార్టీలన్నీ ఏకతాటిపై నిలిచి పార్లమెంటులో ఐక్యంగా పోరాడాలి. మేం ఈ బిల్లును వ్యతిరేకిస్తాం, కానీ మహిళా రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదు. ఈ బిల్లులో వారు పొందుపరిచిన విధానం చూస్తే కనీసం జనాభా లెక్కల ప్రక్రియను కూడా పూర్తి చేయకుండానే డీలిమిటేషన్ అంశాన్ని చేర్చారు. రాజ్యాంగ అధికారాలన్నింటినీ కార్యనిర్వాహక వ్యవస్థ తన గుప్పిట్లోకి తీసుకుంటోంది. ప్రధానంగా వ్యవస్థలు, పార్లమెంటు చేతుల్లో ఉండాల్సిన అధికారాన్ని ఎప్పుడైనా డీలిమిటేషన్ మార్చుకునే వీలుగా వారు తమ చేతుల్లోకి తీసుకున్నారు. అసోం, జమ్మూకశ్మీర్‌లో వారు ఇప్పటికే మమ్మల్ని మోసం చేశారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు.

# పాలనలో దేశానికి తెలంగాణ మోడల్

- రాష్ట్రవ్యాప్తంగా 14 వేల సూపర్ స్పెషాలిటీ బెడ్స్
- ఇతర రాష్ట్రాల అధికారులు అధ్యయనం
- సత్తుపల్లి బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి

**ముద్ర, ఖమ్మం :**



ఇందిరమ్మ ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమం దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు తెలంగాణ మోడల్ పాలనను చూసి అనేక రాష్ట్రాల అధికారులు అధ్యయనం చేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు చదువు, ప్రతి కుటుంబానికి ఆహార భద్రత, సాగునీరు అందించడమే ఈ ప్రభుత్వ ప్రధాన సంకల్పమని స్పష్టం చేశారు. బుధవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో పర్యటించిన ఆయన 100 పడకల ఆసుపత్రిని ప్రారంభించి జాతికి అంకితం చేశారు. సత్తుపల్లి నియోజకవర్గంలోనే అదనంగా కల్లూరులో 50 పడకల ఆసుపత్రిని,పెనుబల్లిలో 30 పడకల ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. వైద్య విద్యను ప్రోత్సహించే దిశగా సత్తుపల్లిలో నర్సింగ్ కళాశాల భవన నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 14,000 సూపర్ స్పెషాలిటీ బెడ్లను అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా, ప్రపంచస్థాయి ప్రమాణాలతో రాష్ట్రవ్యాప్తంగా 100కు పైగా పాఠశాలలను నిర్మిస్తున్నామని, ఒక్కో పాఠశాలకు సుమారు రూ.200 కోట్లు వెచ్చిస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. సత్తుపల్లి, అశ్వారావుపేట, వైరా, ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను మంజూరు చేసినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, ఈ టెక్నాలజీ సెంటర్లను దానికి అనుసంధానం చేస్తామని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఈ సెంటర్లలో అడ్మిషన్లు కల్పిస్తామని, శిక్షణ పొందే ప్రతి విద్యార్థికి నెలకు రూ.2వేల స్కాలర్‌షిప్ అందజేస్తామని ప్రకటించారు. తెలంగాణలోని సుమారు 1.06 కోట్ల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇది దేశంలోనే ఆదర్శవంతమైన కార్యక్రమమని చెప్పారు.

**గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు:**

సొంత ఇంటి కల నెరవేర్చుకోవడానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నామని, ఇది దేశ చరిత్రలోనే అతిపెద్ద ఆర్థిక సహాయమని తెలిపారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మొత్తం 4,50,000 ఇళ్లను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. లబ్ధిదారులు ప్రతి వారం తమ ఇంటి నిర్మాణ ప్రగతిని అప్‌లోడ్ చేస్తే, అధికారులు వెంటనే బిల్లులు చెల్లించేలా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. సత్తుపల్లి సమీపంలోని పులిగుండాల చెరువు, కనకగిరి హిల్స్ ప్రాంతాన్ని ప్రపంచ పర్యాటక పటంలో నిలిచేలా "ఈకో టూరిజం" ప్రాజెక్టుగా తీర్చిదిద్దుతున్నట్లు ప్రకటించారు. వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహిస్తూ జిల్లాలో అదనంగా 3,16,264 ఎకరాలకు సాగునీరు అందించడానికి రూ.2,500 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు.



## ఏఐసీసీ కుర్చీపై రేవంత్ కన్ను

- సీటు కోసమే వింత ప్రతిపాదనలు
- బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

సీఎం రేవంత్ రెడ్డి దృష్టి ఇప్పుడు తెలంగాణపై కంటే మల్లికార్జున ఖర్గే సీటుపైనే ఎక్కువగా ఉందని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. ఖర్గే తర్వాత ఎలాగైనా ఏఐసీసీ అధ్యక్ష పదవిని దక్కించుకోవాలనే ప్లాన్‌తోనే రేవంత్ రెడ్డి ఇలాంటి వింతైన ప్రతిపాదనలు తెరపైకి తెస్తున్నారని ఆయన ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల హక్కుల కోసం బీజేపీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందన్న ఆయన కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రజలను తప్పు దోవ పట్టిస్తోందని మండిపడ్డారు. బుధవారం హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేస్తున్నామని అన్నారు. డీలిమిటేషన్ చట్టాలను గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే చేసిందని, ఇప్పుడు ఆ పార్టీ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. 1972లో కాంగ్రెస్ పార్టీ చేసిన డీలిమిటేషన్ వల్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒక లోక్‌సభ సీటు తగ్గిందని మహేశ్వర్ రెడ్డి గుర్తు చేశారు. జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం ఉండాలని రాజ్యాంగమే చెబుతోందని, ఆనాడు కాంగ్రెస్ చేసిన పొరపాట్లతోనే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగిందని ఆయన మండిపడ్డారు. ప్రస్తుతం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం కేవలం 24 శాతానికే పరిమితమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న సీట్ల సంఖ్యతో రిజర్వేషన్లు అమలు చేస్తే మహిళలకు కేవలం 170 సీట్లు మాత్రమే వస్తాయని చెప్పారు. అదే సీట్లు పెంచిన తర్వాత అమలు చేస్తే ఆ సంఖ్య 270 దాటుతుందని ఆయన లెక్కలతో వివరించారు. మహిళలకు చట్టసభల్లో సరైన గౌరవం దక్కాలంటే సీట్ల పెంపు అనివార్యమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రపంచంలో ఎక్కడా లేని 'హైబ్రిడ్ పాలసీని' రేవంత్ రెడ్డి కనిపెట్టారని, దీన్ని తాను 'గాంధీ డీలిమిటేషన్ ప్రాసెస్ అని పిలుస్తానని ఎద్దేవా చేశారు.

# రిటైర్డ్ ఉద్యోగ పింఛనర్ల ఉద్యమం

- సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్, రిజిస్ట్రార్, రాష్ట్రపతికి లేఖలు

**ముద్ర, హైదరాబాద్:**



పెన్షనర్లకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలు విడి విడిగా, ఉద్యోగ ఉపాధ్యాయ జెఏసి, పెన్షనర్ల జెఏసి పక్షాన రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో అనేక ఉద్యమాలు చేస్తున్నాయి. 2024 మార్చి నుండి రిటైర్ అయిన ఉద్యోగులు "రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్" లాంటి వేదికలేర్పర్చుకొని మండల జిల్లా రాష్ట్ర స్థాయిల్లో అనేక ఉద్యమాలు చేస్తున్నారు. బీజేపి ఎమ్మెల్సీలు కూడా నిరాహార దీక్షలు చేశారు. అయినా ప్రభుత్వం బకాయిల చెల్లింపులో మీనమేషాలు లెక్కిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై వత్తిడి తేవడంకోసం రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యం, నిర్లిప్తతకు నిరసనగా సామాజికవేత్త బక్కా జడ్సన్ గారు వ్రాసిన లేఖను సుప్రీం కోర్టు ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) గా స్వీకరించింది. అందుకు మద్దతుగా రాష్ట్రంలోని రిటైర్డ్ ఉద్యోగులు అందరూ ఈ నెల 15 వ తేదీన సామూహికంగా సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ కు, రిజిస్ట్రార్, భారత రాష్ట్రపతికి లేఖలు రాయాలని, తెలంగాణ రాష్ట్రంలోని పెన్షనర్లు అందరూ అందుబాటులో ఉన్న పోస్టాఫీసులకు వెళ్ళి మూకుమ్మడిగా అట్టి లేఖలు పోస్టు చేయాలని కోరడం జరిగింది. దీనిలో భాగంగా బుధవారం వాసవీ శ్రీ నిలయం ఎల్ బి నగర్ గేటెడ్ కమ్యూనిటీలో ఉన్న పెన్షనర్లు ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ప్రదర్శన నిర్వహించారు. దాదాపు 15 మంది ఈ లేఖలను సమీప పోస్టు ఆఫీసుకు వెళ్ళి సామూహికంగా పోస్టు చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్లు ఆకుల సురేష్ కుమార్, గోలి రాజయ్య, ఇమ్మడి వెంకటేశం, సూర్యపల్లి ఉమాదేవి, ఇంజమూరి రఘునందన్,వీరమల్ల అంజయ్య, టి. యాదగిరి, లంకా సత్యవర్ధన్, రచ్చ ఎల్లయ్య, పల్లాటి నాగయ్య, కొనకంచి భరత్ కుమార్, సాంబశివరావు పాల్గొన్నారు.

# నియోజకవర్గాల పునర్విభజనపై తప్పుడు ప్రచారం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**ముద్ర, వరంగల్:**

డీలిమిటేషన్ పేరుతో ప్రజల్లో అపోహలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని ఇండియా కూటమి ప్రయత్నిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందనే తప్పుడు సాకుతో ప్రాంతీయ వి ద్వేషాలను రెచ్చగొట్ట వద్దని హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రతి ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, చట్టబద్ధంగా నిర్వహిస్తుందని చెప్పారు .. అనవసరపు విమర్శలు మానుకొని రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని సీఎంకు ఆయన సూచించారు. బుధవారం వరంగల్‌లో పర్యటించిన ఆయన.. అక్కడ మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా అమలయ్యే రాజ్యాంగబద్ధమైన ప్రక్రియను రాజకీయం చేయడం సరికాదని ఆయన హితవు పలికారు. డీలిమిటేషన్ అనేది 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరుగుతుందని స్పష్టంగా తెలిసినప్పటికీ, సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను అయోమయానికి గురిచేసేలా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి ప్రతిపాదిస్తున్న 'హైబ్రిడ్ మోడల్' అనేది ప్రపంచంలో ఎక్కడా లేని వింత అని ఎద్దేవా చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
16.04.2026 గురువారం, హైదరాబాద్



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## చిన్నారుల పై క్రూర వ్యాపారం!?

## అమాయకత్వంపై అఘాయిత్యం..

కన్నతల్లి పొత్తిళ్లలో ఆడుతూ పాడుతూ పెరగాల్సిన చిన్నారులను కొందరు దుర్మార్గులు అంగడి సరుకుల్లా మార్చుతున్న దారుణ పరిస్థితి సమాజాన్ని కలచివేస్తోంది. చిన్నారి నవ్వులో కనిపించాల్సిన నిర్దోషిత్వం, వారి కళ్లలో మెరవాల్సిన భవిష్యత్తు ఆశలుఇవన్నీ కొందరి క్రూర వ్యాపారాలకు బలి పశువులవుతున్నాయి. పేదరికం, అజ్ఞానం, నిరాశ్రయ స్థితులను ఆసరాగా చేసుకుని కొన్ని ముఠాలు చిన్నారుల అక్రమ రవాణా అనే ఘోర నేరాన్ని కొనసాగిస్తున్నాయి. నిరుపేద కుటుంబాలకు తక్కువ మొత్తంలో డబ్బు ఇచ్చి పిల్లలను కొనుగోలు చేయడం, అమాయక పిల్లలను అపహరించడం వంటి ఘటనలు పెరుగుతుండటం మన సమాజానికి పెద్ద హెచ్చరికగా మారింది. ఇటీవలి గణాంకాలు చిన్నారుల అదృశ్యాల పెరుగుదలను స్పష్టంగా చూపిస్తున్నాయి. రోజుకు వందల సంఖ్యలో పిల్లలు కనిపించకుండా పోవడం, ప్రతి ఎనిమిది నిమిషాలకు ఒక చిన్నారి అదృశ్యమవుతున్నట్లు అంచనాలు ఉండటం పరిస్థితి ఎంత భయానకమో తెలియజేస్తోంది. ఈ సంఖ్యల వెనుక ప్రతి తల్లి కన్నీరు, ప్రతి కుటుంబం బాధ దాగి ఉంది. ఒక చిన్నారి కనిపించకపోవడం అంటే కేవలం ఒక కేసు నమోదు కాదు—ఒక కుటుంబం జీవితాంతం మానని గాయం. జనసాంద్రత ఎక్కువగా ఉన్న బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఆసుపత్రులు, మురికి వాడలు ఈ ముఠాలకు వేట స్థలాలుగా మారుతున్నాయి. పర్యవేక్షణ లోపాలు, భద్రతా లోపాలు వీరికి అవకాశాలుగా మారుతున్నాయి. అమాయకత్వమే ఈ చిన్నారుల బలహీనతగా మారుతోంది; తెలియని వ్యక్తుల మాటలకు లోనై ప్రమాదంలో పడుతున్నారు. డిజిటల్ యుగంలో కూడా సోషల్ మీడియా, ఆన్లైన్ గేమ్స్ వంటి వేదికలు కొందరు దుర్వినియోగం చేస్తుండటం మరో ఆందోళనకర అంశం.

**నేర ముఠాల క్రూర స్వరూపం..**

అపహరించిన చిన్నారులను భిక్షాటనకు దింపడం, బలవంతపు కార్మికులుగా మార్చడం, అక్రమ కార్యకలాపాలకు వినియోగించడం వంటి అమానవీయ చర్యలు జరుగుతున్నాయి. కొందరు బాలికలను వ్యభిచారంలోకి నెట్టివేస్తుండగా, మరికొన్ని సంఘటనల్లో అవయవాల అక్రమ వ్యాపారం వంటి హీనకృత్యాలు వెలుగులోకి వస్తున్నాయి. చిన్నారి శరీరం, భావాలు, భవిష్యత్తు—ఏదీ ఈ ముఠాలకు విలువ కాదు; లాభమే వారి లక్ష్యం.

పోలీసులు కొన్ని ముఠాలను పట్టుకోవడం కొంత ఊరటనిచ్చినప్పటికీ, సమస్య మూలాలను పూర్తిగా నిర్మూలించడంలో ఇంకా లోపాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఒకే ముఠా కొద్ది సంవత్సరాల్లో డజన్ల సంఖ్యలో పిల్లలను విక్రయించడం వంటి ఘటనలు బయటపడటం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తోంది. విచారణలో ఆలస్యం, న్యాయ ప్రక్రియలో నత్తనడక, బాధితులకు సరైన పునరావాసం లేకపోవడం వంటి సమస్యలు ఇంకా ఉన్నాయి. దత్తత ప్రక్రియలో ఉన్న ఆలస్యాలు, క్లిష్టతలు కూడా ఈ అక్రమ వ్యవస్థకు బలాన్నిస్తున్నాయి!.చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలనుకునే దంపతులు సంవత్సరాల పాటు వేచి చూడాల్సి రావడం వల్ల కొందరు అక్రమ మార్గాల వైపు మళ్లే పరిస్థితి ఏర్పడుతోంది!. ఇది ఒక సామాజికపాలనా వైఫల్యానికి సంకేతం. అందుకే పారదర్శకమైన, వేగవంతమైన, సులభమైన దత్తత విధానం అత్యవసరంగా మారింది.ఈ నేపథ్యంలో చట్టాల కఠిన అమలు, వేగవంతమైన న్యాయ ప్రక్రియ, అంతర్రాష్ట్ర సమన్వయం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ద్వారా ఈ నేరాలను అరికట్టాల్సిన అవసరం ఉంది. సీసీటీవీలు, ట్రాకింగ్ వ్యవస్థలు, డేటాబేస్‌లు సమర్థంగా ఉపయోగపడాలి.

**పరిష్కార దిశగా సమాజం బాధ్యత..**

పిల్లల అక్రమ రవాణా సమస్యను నిర్మూలించాలంటే కేవలం చట్టాలు సరిపోవు—సమగ్ర దృష్టి అవసరం. పేదరిక నిర్మూలన, ఉపాధి అవకాశాల పెంపు, విద్యా ప్రాచుర్యం వంటి మూల కారణాలను పరిష్కరించాల్సిందే. కుటుంబాలు ఆర్థికంగా బలపడితే పిల్లలను అమ్ముకోవాల్సిన పరిస్థితులు తగ్గుతాయి.

ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, పిల్లల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రతి గ్రామంలో, ప్రతి పట్టణంలో బాలల రక్షణ కమిటీలు చురుకుగా పనిచేయాలి. పాఠశాలలు పిల్లలకు 'సురక్షిత ప్రవర్తన' గురించి అవగాహన కల్పించాలి.

ప్రజల్లో అవగాహన పెంపు కూడా కీలకం. అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే అధికారులకు తెలియజేయడం, పిల్లలపై తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. అన్యులపై అప్రమత్తత, పిల్లల కదలికలపై పర్యవేక్షణ, అత్యవసర సంప్రదింపు వివరాలు వారికి నేర్పించడం వంటి చిన్న చర్యలే పెద్ద రక్షణగా మారవచ్చు.

స్వచ్ఛంద సంస్థలు, మీడియా, సామాజిక కార్యకర్తలు కలిసి పిల్లల రక్షణపై చైతన్యం కల్పించాలి. బాధిత పిల్లలకు పునరావాసం, మానసిక బలపరిచే సేవలు అందించడం కూడా అంతే ముఖ్యం. ప్రపంచంలోని కొన్ని దేశాలు అమలు చేస్తున్న కఠిన విధానాలను ఆదర్శంగా తీసుకుని, మన దేశంలో కూడా దృఢమైన చర్యలు చేపట్టాల్సిన సమయం వచ్చింది. పిల్లల రక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత కాదు—ప్రతి పౌరుడి కర్తవ్యమే. మన చుట్టూ ఉన్న ప్రతి చిన్నారి పరిరక్షణ కూడా మన బాధ్యత అనే భావన పెంపొందాలి.

**మన మనసాక్షికి మేల్కొలుపు..**

చిన్నారులు దేశ భవిష్యత్తు అని మనం తరచూ చెబుతాం. కానీ ఆ భవిష్యత్తు ఇంత నిర్లక్ష్యంగా, ఇంత క్రూరంగా అణచి వేయ బడుతున్నప్పుడుమన నిశ్శబ్దం, పాలకుల నిర్లక్ష్యం కూడా మరో అమానవీయ నేరానికి దోహద పడినట్లే!.మనం చూసి కూడా చూడనట్టు ఉంటే, వినీ విననట్టు ఉంటేఅది ముమ్మాటికి సమాజపు వైఫల్యమే.ఒక చిన్నారి అదృశ్యమవడం అంటే కేవలం ఒక గణాంకం కాదుఒక జీవితం చీకటిలోకి జారిపోవడం. ఒక తల్లి కడుపు మంట, ఒక కుటుంబం ఆశల పతనం. ఆ బాధను మాటల్లో చెప్పలేం; కానీ దాన్ని నివారించడానికి చర్యలు తీసుకోవడం మాత్రం మన చేతిలో ఉంది. అందుకే ఇది కేవలం ప్రభుత్వానికి అప్పగించే సమస్య మాత్రమే కాదు, ఇది మన మనసాక్షికి వేసిన ప్రశ్న. మనం చూస్తూ ఉండం కాదు!,స్పందించి నాగరిక సమాజం నుండి ఈ సమస్య నిర్మూలించబడేలా నాంది పలుకుదాం.


చిన్నారిని కాపాడిన ప్రతి అడుగు, ప్రయత్నం మన భవిష్యత్తుతరాన్ని కాపాడు కునేదే. ప్రతి అవగాహన కార్యక్రమం, ప్రతి ఫిర్యాదు, ప్రతి జాగ్రత్తఒక చిన్నారి జీవితాన్ని రక్షించగలదు.

**ఇప్పుడే మేల్కొందాం..**

ఎందుకంటే? రేపటి భద్రత, నేటి స్పందనపై ఆధారపడి ఉంది. మన ఉమ్మడి స్పందనే వారి రక్షణగా మారాలి.



**మేకిరి దామోదర్**
**సామాజిక విశ్లేషకులు,**
**జిల్లా: వరంగల్, ఫోన్: 9573666650.**



# జానపద సాహిత్యానికి బిరుదు రామరాజు ఎనలేని సేవలు


**బిరుదు రామరాజు జయంతి**

సాహిత్య రంగంలో ఆచార్య రామరాజు పేరు తెలియని వారుండరు. తెలుగు సాహిత్యం గురించి ప్రప్రథ డాక్టరేటు పట్టాకోసం చేసి, దేశ విశ్వ విద్యాల జానపద సాహిత్యం పై లకు ప్రవేశం కలిపించ డానికి ప్రేరణ అయినారు రామరాజు. ఆయన పరిశోధన భూమికగా ఇతర విశ్వ విద్యాలయాలలో జానపద సాహిత్యం గూర్చి పరిశోధన ప్రారంభమయింది. తెలుగునాట విశ్వ విద్యాలయాల్లో జానపద సాహిత్య శాఖలను రూపొందించి, వాటిలో తమ పరిశోధనాత్మక రచనలతో, బోధనతో, మార్గ నిర్దేశనంతో ఒకతరం జానపద సాహిత్య పరిశోధకులను, అధ్యాపకులను తయారు చేసిన మార్గదర్శకులు ఆయన. భారతీయ విశ్వ విద్యాలయాల్లోని ఆదర్శ ప్రాయమైన, అరుదైన మౌలిక పరిశోధకుల్లో ఆయన అగ్రగణ్యులు. 1955లో ప్రచురించ బడిన ఆయన పరిశోధనా గ్రంథం... 'జానపద గేయ సాహిత్యము' తెలుగు జానపద అధ్యయనాలకు విజ్ఞాన సర్వస్వంగా అందుబాటులో ఉంది.

బిరుదురాజు రామరాజు 1925 ఏప్రిల్ 16 వ తేదీ దేవనూరు గ్రామంలో లక్ష్మీదేవమ్మ, బిరుదు రాజు నారాయణరాజు దంపతు లకు జన్మించాడు. ప్రాథమిక విద్యను హన్మకొండ శివార్లలోని దేవనూరు, మడికొండలలో పూర్తి చేసి, ఉన్నత చదువుల కోసం ఎనిమిదేళ్లపాటు హన్మకొండకు 14 కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి వచ్చింది. 3వ తరగతి నుండి ఇంటర్మీడియెట్ వరకు ఉర్దూ మీడియంలో చదువుకున్నాడు. మెట్రిక్ చదివేటప్పుడు 11వ ఆంధ్ర మహాసభల సందర్భంగా మహాత్మా గాంధీ వరంగల్ వచ్చినప్పుడు ఆనాటి సభలలో స్వచ్ఛంద సేవలకు అందించాడు. గాంధీజీతో కలిసి పాద యాత్ర చేశాడు. 1947లో కాంగ్రెస్ సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని జైలు పాలయ్యాడు. చదువు కునే రోజుల్లో ఆర్యసమాజం ప్రభావానికి లోనైనాడు. నిజాం వ్యతిరేక రాజకీయోద్యమాలలో చురుకుగా పాల్గొన్నాడు. నిజాం కళాశాలలో బి.ఎ. చదువుతున్న సమయంలో దాశరథి కృష్ణమాచార్యతో పరిచయం ఏర్పడింది. కాళోజీ నారాయణరావు, టి.హయగ్రీవా చారి, ముదిగొండ సిద్ద రాజలింగం, జమలాపురం కేశవరావు తదితర యువ నాయకులతో కలిసి రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం, స్టేట్ కాంగ్రెస్ ఉద్యమాలలో పాల్గొని 1947లో మూడు నెలల పాటు కారాగార శిక్ష అనుభవించాడు. 1947 50ల మధ్యకాలంలో నిజాం కళాశాలలో తెలంగాణా విద్యార్థి సంఘానికి అధ్యక్షుడిగా పని చేశాడు. బి.ఎ.పూర్తయ్యాక న్యాయ శాస్త్రం లో పట్టా పొందాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీలో ఎం.ఎ. చదివే రోజులలో విద్యార్థి నాయకుడిగా గుర్తింపు పొందాడు. ఆ సమయం లో సి.నారాయణ రెడ్డితో కలిసి కొంతకాలం రామనారాయణ కవులు పేరుతో జంట కవులుగా కవిత్వం చెప్పారు. మాడపాటి హనుమంతరావు ఆంధ్రసంఘం నెలకొల్పి దానికి బిరుదురాజు రామరాజును అధ్యక్షుడిగా నియమించాడు. తెలంగాణ రచయితల సంఘానికి తొలి కార్యదర్శిగా ఉన్నాడు. కాగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డాక ఆంధ్ర రచయితల సంఘంగా మారింది. ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం మార్గ దర్శకత్వంలో తెలుగు జానపద గేయసాహిత్యం అనే అంశంపై పరిశోధన చేసి దక్షిణ భారత దేశంలోనే జానపద సాహిత్యం పై మొట్టమొదటి పి.హెచ్.డి ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి సంపాదిం చాడు. సంస్కృతంలో ఎం.ఎ. చేసి అందులో కూడా డాక్టరేట్ పొందా డు.


ఉస్మానియా విశ్వ విద్యాలయంలో 1951లో ఉపన్యాసకుడిగా చేరి క్రమంగా పదోన్నతుల ద్వారా తెలుగుశాఖకు డీన్‌గా, అధ్యక్షు డిగా విధులు నిర్వర్తించాడు. ఆయన మార్గదర్శకత్వంలో 37 మంది పి హె చ్ . డి పట్టాలు పొందా రు. రామరాజు పర్యవేక్షణలో కేతవరపు రామ కోటి శాస్త్రి, కోవెల సుప్రసన్నాచార్య, ముదిగొండ వీరభద్ర శాస్త్రి, అక్కిరాజు రమాపతి రావు, అనంతలక్ష్మి, కాళిదాసు పురుషోత్తం, రవ్వా శ్రీహరి వంటి వారు తమ పరిశోధనలు చేసి డాక్టరేట్ పట్టాలను పొందడం గమనార్హం. 1983లో ప్రొఫెసర్‌గా పదవీ విరమణ చేశాడు.1994లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్, 1995లో భారత ప్రభుత్వం నుండి నేషనల్ ప్రొఫెషనల్‌షిప్, 2001లో సనాతన ధర్మ ఛారిటబుల్ ట్రస్ట్ వారి శివానంద ఎమినెంట్ సిటిజన్ అవార్డ్, 2003లో శ్రీ రాజా లక్ష్మి పురస్కారం,2006/2007లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వారి 'విశిష్ట పురస్కారం', 2009లో సి.పి. బ్రౌన్ అకాడెమీ వారి తెలుగు భారతి పురస్కారం అందుకున్నాడు.

ప్రాచీన సంస్కృతాంధ్ర గ్రంథాల్ని పరిశీలించి, పరిష్కరించి మొదటి సారిగా వెలుగులోకి తేవడానికి విశేష కృషి చేశాడు. సంస్కృతంలో పీహెచ్‌డీ చేసి 'సంస్కృత సాహిత్యానికి ఆంధ్రుల సహకారం' అనే గ్రంథంగా తన వ్యాసాన్ని ప్రచురించాడు. తాళపత్ర గ్రంథాల్ని సేకరించి పలు వ్యాసాల ద్వారా వాటిని పరిచయం చేశాడు. సంస్కృత భాషా సాహిత్యాలకు ఆంధ్రులు చేసిన సేవను గూర్చి విడిగా ఒక పెద్ద పరిశోధన గ్రంథ రచనే చేశాడు. శరత్ చంద్ర ఛటర్జీ, మున్షీ ప్రేమ్‌చంద్ వంటి అగ్ర రచయితల రచనలను తొలిసారిగా తెలుగులోకి అనువదించి సాహిత్యాభి మానులకు పరిచయం చేశాడు. ఉర్దూ, హిందీ, ఆంగ్ల భాషలలో మంచి ప్రావీణ్యం ఉన్న పండితుడు రామరాజు గురు గోవింద్ సింగ్ చరిత్ర, జాతక కథలను హిందీ నుండి తెలుగులోకి అనువదించాడు. ఉర్దూతెలుగు నిఘంటువును కూడా రూపొందించాడు. ఆంగ్లంలో దేశంలోని వివిధ ప్రాంతాలలో అనేక ఉపన్యాసాలు ఇస్తూ, అనేక పుస్తకాలు వ్రాసాడు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు యాభైకి పైగా విశ్వ విద్యాలయాలతో అనుబంధం కలిగి ఉండి, పలు యూనివర్సిటీలకు విజిటింగ్ ప్రొఫెసర్‌గా పని చేశాడు. తెలుగు జానపద అధ్యయనాల గాడ్‌ఫాదర్ గా కీర్తించబడే ఆచార్య రామరాజు, 2010, ఫిబ్రవరి 8 న హైదరాబాదులో మరణించాడు.



**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

# ఆత్మహత్యలు పరిష్కారం కావు



**పరీక్షలు జీవితంలో ఒక భాగం మాత్రమే..**

తెలంగాణ లో ఇంటర్ పరీక్షల ఫలితాలు విడుదల అయ్యాయి.గతంతో పోల్చుకుంటే పాస్ పర్సంటేజ్ పెరిగింది.పరీక్షలలో తప్పామని పది మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నట్లు వార్తలు వచ్చాయి.మరోవైపు కార్పొరేట్ కళాశాలలు మంచి మార్కుల వచ్చిన విద్యార్థుల వివరాలతో కర పత్రాలు ముద్రించి పంపిణీ చేస్తున్నారు. దాన్ని వారి వ్యాపారంలో భాగంగా చూడాలే తప్ప, మన వ్యక్తిగత జీవితానికిఆపాదించుకోకూడదు. మార్కులు తగ్గినా, వెంటనే బెటర్ మెంట్ పరీక్ష ఉంటుంది.పరీక్షల ఒత్తిడితో, ఫెయిల్ అవుతామని, ఫెయిల్ అయ్యామని ఆత్మహత్యలకు పాల్పడుతున్న విద్యార్థుల గురించి వినడం హృదయ విదారకంగా ఉంది. పరీక్షలే జీవితం కాదనే విషయాన్ని విద్యార్థులు, వారి తల్లి దండ్రులు అర్థం చేసుకోవాలి.ఇవి జీవితంలో ఒక భాగం మాత్రమే.ఎందరో గొప్ప వారు తొలుత పరాజయం పొందిన వారే. అమెరికా మాజీ అధ్యక్షులు అబ్రహం లింకన్ ఎన్నో సార్లు ఎన్నికల్లో ఓడిపోయారు. చివరికి అమెరికా అధ్యక్షులు అయ్యారు. ఇంకా హాకింగ్, ఎడిసన్ వంటి శాస్త్రవేత్తలు తమ అంగ వైకాల్యాన్ని అధిగమించి, జీవితంలో విజయం సాధించారు.మనకు ఒకే ఒక జీవితం ఉంటుంది.పరీక్షలలో ఫెయిల్ అయితే జీవితం ముగిసి పోదు. సెలవుల్లో జాగ్రత్తగా చదవాలి. పునః సమీక్ష చేసుకోవాలి. కాపీల ద్వారా గాకుండా, కష్ట పడి చదవాలి. అధ్యాపకుల సలహాలు తీసుకోవాలి. వారిని గౌరవించాలి. ఐ. పి ఎల్ మ్యాచులకు దూరంగా ఉండాలి. అంతేగానీ ఒత్తిడికి గురై, జీవితాన్ని బలి తీసుకోకూడదు. మనం ఏదైనా సాధించాలంటే జీవించాలి. లోపాలను సరిదిద్దు కోవాలి. ఎవరికైనా అవమానాలు వస్తాయి. వాటిని గురించి పెద్దగా ఆలోచించ వద్దు.అలాగని కష్టపడకుండా ఏదీ రాదు.

**కామిడి సతీష్ రెడ్డి జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా**
**9848445134**

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 16.04.2026
www.mudranews.in | @mudranews


**వేసవి అలెర్ట్ :**



శీతల పానీయాలకు దూరంగా ఉండాలి
సోడాలు, కూల్ డ్రింక్స్ శరీరాన్ని ఇంకా డీహైడ్రేట్ చేస్తాయి. వీటి బదులు సహజ పానీయాలు మంచివి.

# ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** గద్వాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సమస్యలను పరిష్కరించి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కమిటీ సభ్యులు, వైద్యాధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన గద్వాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తో కలిసి కలెక్టర్ మాట్లాడారు. ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, ఇతర సిబ్బందిని నిబంధనల ప్రకారం నియమించేందుకు ముందుకెళ్లాలన్నారు. ఆసుపత్రిలో ఆయా విభాగాల వారీగా అవసరమైన పరికరాలు, ఇతర వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఆసుపత్రి నిధులను ప్రాధాన్య క్రమంలో వినియోగించాలని సూచించారు. ఆసుపత్రి వద్ద పార్కింగ్ సమస్య లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మెప్మా కు సంబంధించిన అర్బన్ సెల్టర్ హోమ్ నిర్మాణానికి గతంలోనే రూ. కోటికి పైగా నిధులు మంజూరు కావడంతో తగిన స్థలంలో నిర్మించాలన్నారు. సదరన్ సర్టిఫికెట్స్ క్యాంపుకు వచ్చే దివ్యాంగులకు ఇబ్బంది లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. గాంధీ చౌక్ లోని పాత జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో పలు గదులు ఖాళీగా ఉండడంతో అక్కడికి ఆయుష్ ఆసుపత్రిని తరలించేందుకు ఆలోచించాలన్నారు. గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ గద్వాల నుంచి ఇప్పటికి చాలా మంది రోగులు మెరుగైన వైద్య సేవల కోసం కర్నూల్ వెళ్లాల్సి వస్తోందని, జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా సేవలందించాలన్నారు. గద్వాల జనరల్ ఆస్పత్రిలో అన్ని శస్త్ర చికిత్సలు చేసేందుకు అవసరమైన వైద్యులు, యంత్ర పరికరాలను అందుబాటులో ఉంచాల్సి ఉందన్నారు. గర్భిణీలు ప్రసవాల కోసం ప్రైవేటు ఆసుపత్రులకు వెళితే సిజేరియన్లు ఎక్కువగా చేస్తున్నారని, రూ. 30 వేలకు పైగా బిల్లులు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే



ప్రసవాలు అధికంగా చేయాలన్నారు. గద్వాల జనరల్ ఆస్పత్రిలో జనరేటర్ల నిర్వహణకు అవసరమైన నిధులను కేటాయించాల్సి ఉందన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ల స్థానాలతో పాటు, ఇతర వైద్య సిబ్బందినీ పూర్తి స్థాయిలో నియమించేందుకు తనవంతుగా కృషి చేస్తానన్నారు. వైద్య ఆరోగ్యశాఖ తరపున రోగులకు మంచి వైద్య సదుపాయాలు కల్పించినప్పుడే ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కలుగుతుందని, ఆ దిశగా సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులు చిత్తశుద్ధితో పనిచేయాల్సి ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయి, ఆసుపత్రి పర్యవేక్షకులు ఇందిర, మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, టీజీఎంఎస్ఐడిసి డిఈ శ్రీనివాసులు, ఏఈ రహీం, కమిటీ సభ్యులు శ్రీధర్ గౌడ్, ఇతర వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజ్‌గిరిలో..

**ముద్ర మల్కాజిగిరి:** ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మల్కాజ్‌గిరి ప్రభుత్వ ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆసుపత్రిలో సమస్యలను వైద్యులు వివరించగా, వాటి పరిష్కారానికి తాను కట్టుబడి పనిచేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కంప్యూటర్లు, ఫర్నిచర్ వంటి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. సిహెచ్సి మల్కాజ్‌గిరి ఆసుపత్రి, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌కు అనుబంధంగా పనిచేస్తున్న నేపథ్యంలో, త్వరలో పూర్తికానున్న టిఐఎంఎస్ ఆసుపత్రికి సిబ్బంది మార్పిడి జరిగితే సేవలపై ప్రభావం పడే అవకాశం ఉందని, ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. రోజుకు సుమారు 800 మంది ఔట్‌పేషెంట్లు వస్తుండటంతో అభా కార్డుల నమోదు పెంపు కోసం అదనపు సిబ్బంది అవసరమని పేర్కొన్నారు. ఆసుపత్రి సమీపంలోని ప్రభుత్వ భూమిపై ఎమ్మార్వోతో కలిసి



పరిశీలన జరిపి, అది ఆసుపత్రికి చెందినదైతే బోర్‌వెల్, ట్యాంక్ సంప్ నిర్మించాలని ఆదేశించారు. తాగునీటి ప్రెజర్ పెంపు, రోగులు, సందర్శకుల కోసం బెంచీలు ఏర్పాటు వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్ పార్కింగ్. ఫైర్ సేఫ్టీ, అంబులెన్స్, పోలీస్ అవుట్‌పోస్ట్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఉమా గౌరీ, డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాధ పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

### గన్యాగుల విద్యార్థినికి స్టేట్ ర్యాంక్



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** మండలం గన్యాగుల గ్రామానికి చెందిన కొమ్మిడి సరిత, శేఖర్ రెడ్డి దంపతుల కుమార్తె కొమ్మిడి స్ఫూర్తి ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470లో 468 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంక్ కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా స్ఫూర్తి కుటుంబ సభ్యులు, గురువులు ఆనందం వ్యక్తం చేస్తూ ఆమె భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. గ్రామానికి గర్వకారణంగా నిలిచిన స్ఫూర్తిని ప్రముఖులు, విద్యాభిమానులు అభినందించారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాగర్ కర్నూల్ పట్టణం, మండలం, బిజినపల్లి, తాడూర్, తిమ్మాజిపేట, తెల్కపల్లి మండలాలకు చెందిన మొత్తం 229 మంది లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ ప్రభుత్వానికి ప్రజల సంక్షేమమే ముఖ్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఎవరైనా పథకాలకు దూరంగా ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని, ప్రజలకు ఏ సమస్య వచ్చినా తమవంతు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు.

### బీఎస్సీ ఎంఎల్‌టీ కోర్సు మంజూరు

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎంఎల్టీ) కోర్సు నూతనంగా మంజూరు చేయబడిందని కళాశాల ప్రిన్సిపాల్ మదన్మోహన్ తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన బైపీసీ విద్యార్థులు, ఇంటర్ స్థాయిలో ఎంఎల్టీ పూర్తి చేసిన విద్యార్థులు, అలాగే కస్తూర్బా గాంధీ కళాశాలలో సంబంధిత కోర్సు పూర్తి చేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైందని, విద్యార్థులు ఇంటర్ పూర్తి చేసిన వారు దోస్తు వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు.

### ధాన్యం నిల్వకు సీఎంఆర్ డెలివరీ వేగవంతం చేయాలి

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డిజిల్లా ప్రతినిధి:** రాబోయే రబీ సీజన్లో వరి ధాన్యం నిల్వకు స్థలం కల్పించేందుకు, సిఎంఆర్ డెలివరీని వేగవంతం చేయాలని పౌరసరఫరాలు, మార్కెటింగ్, గిడ్డంగుల శాఖ అధికారులను జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) చంద్రారెడ్డి ఆదేశించారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో రైస్ మిల్లర్లకు ప్రత్యేక సూచనలు చేశారు. పౌర సరఫరాల శాఖ ఎండి ఇచ్చిన సవరించిన ఒప్పందం ప్రకారం రబీ సీజన్ వరి ధాన్యం కస్టమ్ మిల్లింగ్ కార్యకలాపాల కోసం డిస్ట్రిక్ట్ మేనేజర్‌తో ఒప్పందం కుదుర్చుకోవాలని ఆదేశించారు. గత సీజన్లలో తిరిగి ఇవ్వాల్సిన, ఉపయోగపడే పాత గోనె సంచులను పెద్ద మొత్తంలో ఎలాంటి ఆలస్యం లేకుండా సివిల్ సప్లయ్ అధికారులకు తిరిగి ఇవ్వాలని సూచించారు. ధాన్యం సేకరణ సజావుగా సాగేందుకు, సివిల్ సప్లైస్ కమిషనర్ సూచనలను సకాలంలో పాటించాలని అదనపు రైస్ మిల్లర్లను ఆదేశించారు.

## కో-ఆప్షన్ సభ్యుల ఎంపికకు నోటిఫికేషన్

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ పురపాలక సంఘంలో కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక కోసం కమిషనర్ నాగిరెడ్డి నోటిఫికేషన్ జారీ చేశారు. మున్సిపల్ పరిపాలనలో ప్రత్యేక పరిజ్ఞానం, అనుభవం కలిగిన ఇద్దరు సభ్యులు (వారిలో ఒకరు మహిళ ), అల్పసంఖ్యాక వర్గానికి చెందిన ఇద్దరు సభ్యులు (వారిలో ఒకరు మహిళ )ను చట్టప్రకారం ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఓటరు జాబితాలో నమోదై ఉండి, కనీసం 21 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలి. అదనంగా మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ లేదా వార్డు సభ్యుడిగా కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలి. పంచాయతీలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుడిగా ఐదేళ్ల అనుభవం కలిగి ఉండాలి. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌లో మూడేళ్లు పనిచేసిన అడ్వకేట్ అయి ఉండాలి. లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేదా స్థానిక సంస్థల్లో గెజిటెడ్ ఉద్యోగిగా పనిచేసి రిటైర్ అయి, మున్సిపల్ పరిపాలనలో అనుభవం కలిగి ఉండాలి. అల్పసంఖ్యాక వర్గానికి చెందిన అభ్యర్థులు కూడా మున్సిపల్ ఓటరు జాబితాలో నమోదై ఉండి, కనీసం 21 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. అల్పసంఖ్యాక వర్గానికి చెందిన వారై ఉండాలి. అర్హతలు కలిగిన ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులతో పాటు అవసరమైన ధృవపత్రాలను జతపరచి ఈ నెల 24 సాయంత్రం 5 గంటలలోపు కమిషనర్ కార్యాలయానికి సమర్పించాలని సూచించారు.

# కేజీబీవీ విద్యార్థులను అభినందించిన కలెక్టర్

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు, ప్రతిభ చాటిన కేజీబీవీ జూనియర్ కళాశాల విద్యార్థులను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణ, లక్ష్యసాధనపై దృష్టి పెడితే గ్రామీణ ప్రాంతాల బాలికలు కూడా అద్భుత విజయాలు సాధించగలరని అన్నారు. భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసిస్తూ వైద్య, ఇంజినీరింగ్ తదితర రంగాల్లో ఉన్నత స్థానాలు సాధించాలని సూచించారు. ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరాల పరీక్షల్లో బైపీసీ, ఎంపీసీ, ఎం.పి.హెచ్.డబ్ల్యూ విభాగాల్లో విద్యార్థినులు అధిక శాతంలో ఉత్తీర్ణత సాధించడంతో పాటు రాష్ట్ర స్థాయి ర్యాంకులకు సమానంగా నిలిచే మార్కులు సాధించడం విశేషం. గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన ఈ బాలికలు అన్ని



అడ్డంకులను అధిగమించి సాధించిన ఈ విజయాలు విద్యా వర్గాల్లో ప్రశంసలు పొందుతున్నాయి.విద్యార్థినుల కష్టపడి చదవడం, ఉపాధ్యాయుల నిరంతర మార్గదర్శకత్వం, కేజీబీవీ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య ఈ ఫలితాలకు ప్రధాన కారణమని కలెక్టర్ అన్నారు. అలాగే ఈ విజయాల వెనుక ఉన్న ఉపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు, తల్లిదండ్రుల సహకారాన్ని ప్రశంసించారు.జిల్లాలోని అన్ని కేజీబీవీ పాఠశాలల్లో ఇదే తరహా ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. విజయాన్ని పురస్కరించుకుని విద్యార్థినులు ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకున్నారు. తమ కష్టానికి తగిన ఫలితం దక్కిందని, భవిష్యత్తులో మరింత కృషి చేసి ఉన్నత లక్ష్యాలను సాధిస్తామని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్ మాట్లాడుతూ కేజీబీవీ బాలికల ప్రతిభ జిల్లాకు గర్వకారణమని, ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పర్యవేక్షణాధికారి శోభారాణి, ప్రత్యేక అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను అభినందించిన డీఈవో

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** ఇ-అభ్యాస్ ఐఐటీ ఫౌండేషన్ స్టాండర్డ్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన స్థానిక లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులను బుధవారం శాలువాలతో సన్మానించారు. జర్నలిస్ట్ సయ్యద్ రబ్బాని కుమార్తె రిదా కరీమా మొదటి ర్యాంకు సాధించగా, అదే



పాఠశాలకు చెందిన మహమ్మద్ ఫైజాన్ (3వ తరగతి) రెండవ ర్యాంకు, మేఘన (6వ తరగతి) మూడవ ర్యాంకు సాధించారు. హైదరాబాద్‌లోని భారతీయ విద్యా భవన్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఇ-అభ్యాస్ ఫౌండేషన్ ప్రతినిధులు వీరికి సర్టిఫికెట్లు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులను ఐఐటీ స్థాయిలో తీర్చిదిద్దే విధంగా నాణ్యమైన విద్య అందించిన పాఠశాల యాజమాన్యం, అధ్యాపక బృందాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ (ఎగ్జామినేషన్) రాజశేఖర్ రావు, పాఠశాల ప్రిన్సిపాల్ సింగిరెడ్డి ఫాతిమా రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ వీరప్ప, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను జిల్లా విద్యాభిమానులు, పాఠశాల అధ్యాపక బృందం అభినందించారు.

## అగ్నిమాపక సేవా వారోత్సవాలు

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** అగ్నిమాపక సేవా వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా జిల్లా అగ్నిమాపక అధికారి గిరిధర్ రెడ్డి పర్యవేక్షణలో నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట కేంద్రాల్లో ప్రత్యేక చైతన్య కార్యక్రమాలు చేపట్టారు. నిర్లక్ష్యం, షార్ట్ సర్క్యూట్, గ్యాస్ లీకేజీల వల్ల ఎక్కువగా అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ఇళ్లలో, వ్యాపార ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు సూచనలు ఇచ్చారు.అగ్నిప్రమాదం సంభవించినప్పుడు భయపడకుండా సమయస్ఫూర్తితో మెలగాలని, విద్యుత్ మంటలపై నీళ్లు పోయకూడదని హెచ్చరించారు. ఫైర్ ఎక్స్‌టింగ్యుషర్ల వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించి, మంటలను ప్రారంభ దశలోనే అదుపులోకి తీసుకురావాలని సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే 101 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని, ప్రజల అప్రమత్తతతోనే ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమాల్లో ఫైర్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



# రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**అదనపు ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** ప్రతి ఒక్కరూ బాధ్యతగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని జిల్లా అదనపు ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలోని హైస్కూల్లో నిర్వహించిన “అరైవ్–అలైవ్” అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దేశంలో సగటున ప్రతి నాలుగు నిమిషాలకు ఒక రోడ్డు ప్రమాదం జరుగుతోందని, వీటిలో ఎక్కువగా యువత ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనం నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి, రాంగ్ రూట్‌లో, అతివేగంగా లేదా నిర్లక్ష్యంగా వాహనాలు నడపకూడదని హెచ్చరించారు. చిన్న తప్పిదం కూడా కుటుంబాలకు తీరని విషాదాన్ని మిగులుస్తుందని చెప్పారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నియమాలు పాటించడం



వంటి విషయాలను గుర్తు చేయాలని సూచించారు. అలాగే మైనర్ డ్రైవింగ్ పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా నాగర్ కర్నూల్ పట్టణంలో విద్యార్థులతో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో అధికారి రమేష్, సబ్ ఇన్స్పెక్టర్ గోవర్ధన్, ట్రాఫిక్ ఆర్ఎస్ఐ కళ్యాణ్, కల్వకుర్తి సబ్ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.


## ఇంటర్ సప్లమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదల



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ, ప్రాక్టికల్ పరీక్షల షెడ్యూల్‌ను జిల్లా నోడల్ అధికారి వెంకటరమణ విడుదల చేశారు. ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు, అలాగే ఇంప్రూవ్మెంట్ పరీక్షలు రాయదలచిన వారికి ఈ పరీక్షలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈనెల 13 నుంచి 20 వరకు సంబంధిత కళాశాలల్లో ఫీజులు చెల్లించుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. థియరీ పరీక్షలు మే 13 నుంచి మే 20, 2026 వరకు నిర్వహిస్తారని తెలిపారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు సెషన్లలో జరుగుతాయి. సైన్స్ విభాగానికి సంబంధించిన ప్రాక్టికల్ పరీక్షలు మే 22 నుంచి మే 25 వరకు నిర్వహించబడతాయి. వీటి సమయం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష మే 26న ఉదయం 10 గంటల నుండి, మధ్యాహ్నం 2 గంటల నుండి నిర్వహించనున్నారు. పర్యావరణ విద్య పరీక్ష మే 28న ఉదయం 10 గంటల నుంచి, మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుంది. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఒక్కో పేపర్‌కు రూ.100, ప్రాక్టికల్ ఫీజు రూ.800 చెల్లించాల్సి ఉంటుంది. ఫీజు చెల్లింపుకు చివరి తేదీ ఏప్రిల్ 20గా నిర్ణయించారు. విద్యార్థులు గడువులోపు నమోదు పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు.

# మండల సభలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి


**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లాలో “ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక” 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించనున్న మండల స్థాయి గ్రామ సభలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 16న జరగనున్న ఈ సభలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, జీవి శ్యాంప్రసాద్ లాల్‌తో పాటు ఎంపీడీవోలు, ఎంపీఓలు, తహసీల్దార్లతో చర్చించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని 20 మండల కేంద్రాల్లో గ్రామ సభలను సమగ్ర ప్రణాళికతో నిర్వహించి, ప్రతి గ్రామ, మండలానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై



ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు

### 16 నుండి జరిగే మండల స్థాయి సభలను విజయవంతం చేయాలి

**ముద్ర, ఉమ్మడిరంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్, 16 నుండి నిర్వహించే మండల స్థాయి సభలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులు,




ఆర్డీఓలు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. మండల స్థాయి సభలలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, మంత్రులకు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు, ఎమ్మెల్యేలకు ముందస్తు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఆర్డీఓలు, జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణ రెడ్డి, సిపిఓ సౌమ్య, జిల్లా అధికారులు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

### వేసవి అలెర్ట్:

నీరు ఎక్కువగా ఉన్న పండ్లు తినాలి



తర్బూజ, దోస కాయ వంటి పండ్లు శరీరానికి నీరు అందిస్తాయి. వేసవిలో ఇవి తప్పనిసరి.

# రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తాం

**- ప్రకటనలు చూసి మోసపోవద్దు**

**- తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి**




**ముద్ర, కరీంనగర్:** జిల్లాలో రాబోయే వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు నాణ్యమైన విత్తనాలు తమ సంస్థ ద్వారా అందిస్తామని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి పేర్కొన్నారు. వానా కాలం సీజన్ లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించే అంశంపై బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో విత్తన డీలర్లు, సహకార సంఘాల సీఈఓలు, ఎఫ్‌పీఓలు, ఏఆర్ఎస్‌కే ప్రతినిధులతో చైర్మన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తో పాటు పలువురు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో విత్తన సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.సీడ్స్ కార్పొరేషన్ కరీంనగర్ యూనిట్ రంగపేట నుంచి నాణ్యమైన విత్తనాలను ఉమ్మడి జిల్లా రైతులకు సరఫరా చేస్తా మని తెలిపారు.

తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ పనితీరును చైర్మన్ అన్వేష్ రెడ్డి వివరించారు. మన రైతులు పండించిన విత్తనాలనే సేకరించి, వాటిని అధునాతన ల్యాబ్‌లలో పరీక్షించి, నాణ్యత నిర్ధారణ అయిన తర్వాతే తిరిగి రైతులకు సాగు కోసం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రైవేట్ కంపెనీలకు దీటుగా ప్రభుత్వ విత్తనాల నాణ్యత ఉంటుందని అన్వేష్ రెడ్డి గారు భరోసా ఇచ్చారు. రైతుల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా సంస్థ పనిచేస్తుందన్నారు. ప్రస్తుత సీజన్‌కు అవసరమైన వరి విత్తనాలు సమృద్ధిగా ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం మార్కెట్లో డిమాండ్ ఉన్న సన్నారకల్లో ప్రధానంగా బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, కెఎన్ఎం 1638 జేజిఎల్ 27356 రకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. దొడ్డు రకాల విషయానికి వస్తే కెఎన్ఎం 118, ఎమ్‌టియు 1010 రకాలను నిల్వ ఉంచినట్లు తెలిపారు. వీటితో పాటు భూసారాన్ని పెంచే పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుమును పిల్లిపెసర రైతులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

గ్రామ గ్రామానా ప్రభుత్వ విత్తనాలను రైతులు పెద్ద ఎత్తున కొనుగోలు చేసేలా ప్రత్యేక ప్రణాళిక రచిస్తున్నామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. ఇందుకోసం స్వశక్తి మహిళా సంఘాలు వ్యవసాయ అధికారులు పంచాయతీ కార్యదర్శుల సహకారంతో ముందుకు వెళ్తామన్నారు.రైతులను అప్రమత్తం చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్డిఓ కే మహేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి , జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీధర్, జిల్లా సహకార అధికారి సీడ్ కార్పొరేషన్ మేనేజర్ రాజీవ్ కుమార్, కరీంనగర్ ప్రాంతీయ మేనేజర్ విష్ణు వర్ధన్ రెడ్డి, జిల్లా మహిళా సమైక్య అధ్యక్షురాలు సబిత, ఏడీఏలు, మండల వ్యవసాయ అధికారులు, విత్తన అధికారులు శ్రీకాంత్, మౌనిక, డీలర్లు, ఎఫ్‌పీఓ మహిళా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో మెరిసిన అల్ఫోర్స్ సీబీఎస్ఈ విద్యార్థులు

**ముద్ర, కరీంనగర్:** సీబీఎస్ఇ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు సత్తా చాటారు. సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో అల్ఫోర్స్ హై స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులను సాధించడం పట్ల విద్యా సంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

103 మంది విద్యార్థులు 500 మార్కులకు గాను 450 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో నూతన చరిత్రను సృష్టించారని హర్షం వ్యక్తం చేశారు. సానీక-494, ఆదిత్య-492, ఎం.శ్రీహిత, ఏ.హర్ష & ఏ.శ్రీనిత 490 మార్కులు, కే.ఓం కార్తికేయ, కె.అస్మిత & కే.అభిజ్ఞ 488 మార్కులు, ఏ.స్వరవిస్తృతి 487 మార్కులు, ఎం.శ్రీగౌరీ 486 మార్కులు, కె.వర్ధిని 485 మార్కులు, ఉదయశ్రీ & వి. అభిరామ్ - 484, కే.మోక్స్, జి.సాయి సుశేన్ & ఈ ప్రమేష్ రెడ్డి -483 మార్కులు సాధించారని తెలిపారు. వివిధ సబ్జెక్టులలో నూరు శాతం మార్కులు సాధించారని సంతోషం వ్యక్తం చేశారు. తీయస్థాయిలో మెరిసినటువంటి విద్యార్థులందరికీ అభినందనలు తెలిపి పుష్పగుచ్చాలను అందజేసి రానున్న రోజుల్లో మరిన్ని అద్భుత విజయాలను నమోదు చేసి జిల్లా కీర్తిని ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు

## ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదు పెంచాలి



**కోరుట్ల, ముద్ర:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈఓ లోకిని శ్రీనివాస్ కోరారు. కథలాపూర్ మండలం పోతారం పీఎం శ్రీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఏక్ భారత్ - శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల హర్యానా సాంస్కృతిక నృత్యాలు, పాటలు అతిథులను ఆకట్టుకున్నాయి. తెలంగాణ, హర్యానా సంస్కృతులను ప్రతిబింబించే ఆహార పదార్థాలు, వేషధారణ, నృత్యాలు, పండుగలు, చారిత్రక కట్టడాల గురించి ప్రదర్శించారు. విద్యార్థుల్లో చిన్నతనం నుంచే భిన్నత్వంలో ఏకత్వం పై అవగాహన కల్పించేందుకు, సంప్రదాయాలను గౌరవిస్తూ విద్యార్థులలో ఐక్యత భావాన్ని పెంపొందించేందుకు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు జరగడం అభినందనీయమన్నారు. పిల్లలు నృత్యాలు, వేషధారణ వారి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే చిన్నారులకు ఉచితంగా దుస్తులు, అల్పాహారం, భోజనాలు, పుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి విభిన్నమైన కార్యక్రమాలు పిల్లల్లో పాఠశాల పట్ల ఇష్టాన్ని పెంచుతాయని తెలిపారు. అనంతరం విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ వినూత్న కార్యక్రమం నిర్వహించిన పాఠశాల సిబ్బందిని గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న జలంధర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్ పర్సన్ పులి శిరీష హరిప్రసాద్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో సూచించారు. సాధారణ స్థాయికి మించి 1.5°C నుంచి 3.5°C వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని తెలిపారు. జిల్లాలో వచ్చే వారం రోజుల పాటు వేడి గాలులు (హీట్‌వేవ్) ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందన్నారు. పట్టణాలు, గ్రామాల్లోని అవసరమైన ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, రెడ్‌క్రాస్ వంటి సేవా సంస్థలను భాగస్వాములుగా చేయాలని సూచించారు. చలివేంద్రాల్లో ప్రజలకు తాగునీటితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు.

## కందుల డబ్బులు విడుదల

**బోథ్, ముద్ర:** మార్క్ ఫెడ్ కు అమ్మిన కందుల డబ్బులు రూ. 10 కోట్లు విడుదలైనట్లు డీసీసీ అధికార ప్రతినిది పసుల చంటి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మార్చి 17 వరకు కందులు అమ్మిన రైతుల ఖాతాల్లో డబ్బుల జమ కానున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఫిబ్రవరి 27 వరకు మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన కందుల డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.

## ఓపెన్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** జిల్లాలో ఓపెన్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఓపెన్ పది, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 27 వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రతి రోజు రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు నిర్వహించాలన్నారు. 1,856 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు.

# కరీంనగర్ రోల్ మోడల్ గా నిలవాలి..

**కలెక్టర్ చిత్రా మిశ్రా**




**ముద్ర, కరీంనగర్:** జిల్లాలో ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక పకడ్బందీగా అమలు చేసి కరీంనగర్ ను రోల్ మోడల్ గా నిలపాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులకు సూచించారు. ఈ నెల 16వ తేదీ గురువారం మండల స్థాయిలో జరిగే సమావేశాల నేపథ్యంలో బుధవారం సాయంత్రం జిల్లా స్థాయి అధికారులతో పాటు ఎంపీడీవోలు, ఎంఈఓలు, ఎంపీవోలతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల స్థాయి సమావేశాలను విజయవంతం చేయడానికి పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సంక్షేమ పథకాల వారీగా లబ్ధిదారుల వివరాలను వెల్లడించాలని సూచించారు. రైతు భరోసా, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, మహిళలకు రుణాలు, కార్పొరేషన్ల ద్వారా అందించిన రుణాలు, మహాలక్ష్మి పథకం, సన్నబియ్యం పంపిణీ వంటి అంశాలపై ప్రత్యేకంగా వివరించాలన్నారు. మండలాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. విద్య, వైద్యం, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం, రైతు సంక్షేమం వంటి రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, అందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని తెలిపారు. "అరైవ్ అలైవ్" లో ప్రజలను భాగస్వాములు చేయాలన్నారు.

# కేసీఆర్ సభను విజయవంతం చేయాలి




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జిల్లా కేంద్రంలో ఈ నెల 20న నిర్వహించే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పిలుపునిచ్చారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, ఎమ్మెల్సీ రమణ, మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాబు రెడ్డి, జెడ్పీ మాజీ చైర్ పర్సన్ దావా వసంత సురేష్ లతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ లో చేరబోతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, వాటి ప్రయోజనాలను గ్రామ స్థాయిలోకి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే ప్రతి గ్రామంలో సమావేశాలు నిర్వహిస్తూ విస్తృత ప్రచారం చేయాలన్నారు. యువతను పెద్ద ఎత్తున సభకు తీసుకురావాలని కోరారు. సభ విజయవంతం కోసం మండల, గ్రామ స్థాయి నాయకులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

## అరకొరగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



**కోరుట్ల, ముద్ర:** కథలాపూర్ మండల కేంద్రంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని బుధవారం బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు పరిశీలించారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడిపల్లి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అరకొరగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడిపల్లి గోపాల్ రెడ్డి ఆరోపించారు. కథలాపూర్ మండల కేంద్రంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని బుధవారం బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు మండల కేంద్రంలో కేవలం రెండు లారీల మొక్కజొన్నలు మాత్రమే కొనుగోలు చేశారన్నారు. పంట చేతికొచ్చిన మార్చిలో ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోయారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వానాకాలం పంటను నవంబర్, డిసెంబర్ లో కొనుగోలు చేయాలన్నారు. యాసంగి పంటను మార్చి లో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూడా వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. కటింగు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. రైతులను ఇబ్బదులకు గురిచేస్తే పెద్ఎ దత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వరరావు, నాయకులు గాంధారి శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** మహిళలు ఆర్థికాభివృద్ధి చెందే విధంగా కృషి చేయాలని రాష్ట్ర సెర్ప్ సీనియర్ మేనేజర్ డి. కల్పన సూచించారు. డీఆర్ డీఓ కార్యాలయం లో బుధవారం సెర్ప్ ఆధ్వర్యంలో స్వశక్తి సంఘాల సభ్యులకు లర్నింగ్, వన్ స్టాప్ ఫెసిలిటి సెంటర్ అభివృద్ధి పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని డిఆర్ డీవో యం.రఘువరణ్, ఈఈపీఆర్ ఓ లక్ష్మణ రావు, అడిషనల్ డిఆర్ డీఓ సునీతతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో మహిళా శక్తి భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీపీఎంలు రమేష్, నారాయణ, నాగేశ్వర్ రావ్, జిల్లా ఏపీఎం లు గంగాధర్, చక్రవర్తి, త్రివేణి, హుస్సేన్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరోజన, కార్యదర్శి ఆమనీ, కోశాధికారి హరిత, సీసీ సత్యనారాయణ, ఆయా యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

## పుష్కరాల పనుల వేగం పెంచాలి

**మహాదేవపూర్, ముద్ర:** సరస్వతీ పుష్కరాల పనుల వేగం పెంచాలని కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కాళేశ్వరంలో జరుగుతున్న స్టోన్ క్లాడింగ్, పార్కింగ్ టైల్స్, మ్యూజియం నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేలో నిర్వహించే సరస్వతీ పుష్కరాల దృష్ట్యా అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. . ఘాట్ పరిసరాల్లో మౌలిక వసతులు, పార్కింగ్ సదుపాయాలు మెరుగుపరిచే పనులను సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, ఇరిగేషన్ ఈఈ తిరుపతిరావు, ఆర్ అండ్ బీ ఈఈ రమేష్, కాటారం డిఎస్పీ సూర్యనారాయణ, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపీడీఓ రవీంద్ర నాథ్, దేవస్థానం ఈఈ మహేష్, సర్పంచ్ మోహన్ రెడ్డి, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
16.04.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**వేసవి అలెర్ట్**

ఆయుర్వేద కషాయం తాగాలితుంగ ముస్తెలు, చందనం వంటి పదార్థాలతో చేసిన కషాయం శరీరాన్ని చల్లబరుస్తుంది. లవణాలను పెంచుతుంది.



# చేనేత కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరాలు

- **జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**
జిల్లాలోని చేనేత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని నేటి నుండి మే 13 వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 10,323 మంది చేనేత కార్మికులు నివసిస్తున్నారని ఆయా మండలాలు, గ్రామాలలో నేటి నుండి ఆరోగ్య శిబిరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ ఆరోగ్య శిబిరాలలో ప్రభుత్వ వైద్యులు జనరల్ ఫిజీషియన్, ఆప్తమాలజిస్ట్ (కంటి వైద్యుడు), ఆర్థోపెడిషియన్ (ఎముకల వైద్యుడు) పాల్గొని చేనేత కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేస్తారని చెప్పారు. ఈ శిబిరాలలో చేనేత కార్మికులకు రక్తపోటు (బీపీ) పరీక్షలు, షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలు, ఎముకల సమస్యల నిర్ధారణతో పాటు వివిధ దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి వ్యాధుల తీవ్రతను బట్టి రిఫరల్ హాస్పటల్ తీసుకొని వెళ్లడం జరుగుతుందన్నారు. జిల్లాలోని చేనేత కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఈ ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**శిబిరాల సమయం**
ప్రతి రోజు ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు ఉంటుందని తెలిపారు.
16న ఆలేరు మండలం గౌడ సంఘంలో,
17–న ఆత్మకూరు మండలం పీహెచ్సీలో,
18న యూపీహెచ్సీ భువనగిరిలో,
20 నుండి 23 వరకు చౌటుప్పల్, కొయ్యలగూడెం, కుంట్లగూడెం ప్రాంతాలు,
24న పీహెచ్ సీ మోటకొండూరు,
25న పీహెచ్ సీ మోత్కూర్,
27 నుండి మే 2 వరకు పోచంపల్లి సొసైటీ డైయింగ్ హౌస్,
04న పీహెచ్ సీ రాజాపేట,
05, 06న – పీహెచ్ సీ రామన్నపేట,
07న పీహెచ్ సీ వలిగొండ,
08న పీహెచ్ సీ యాదగిరిగుట్ట,
11న పీహెచ్ సీ గుండాల,
12న పీహెచ్ సీ నారాయణపూర్,
13న పుట్టపాక క్లస్టర్ బిల్డింగ్ లో..



# ప్రజా పాలనలో భాగస్వామ్యం కావాలి

- **సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్**




**ముద్ర, సూర్యాపేట:**
ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 16న నిర్వహించే మండల స్థాయి సమావేశాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. వెబ్ ఎక్స్ ద్వారా జిల్లా ఎస్పీ కె.నరసింహ ఆర్డీఓ, తహసిల్దార్లు, ఎంపీడీఓలు, ఏపీఓ, ఏపీఎం, ఎంపీఓలతో మాట్లాడుతూ.. "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 16న మండల స్థాయి కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని వాటిలో ప్రస్తుత, రాబోయే ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలపై విస్తృత అవగాహన కల్పించండం పరిపాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించండం, స్థానిక సమస్యలను, అభివృద్ధి ప్రాధాన్యతలను గుర్తించడం, పారిశుధ్యం, పరిశుభ్రత & ఫైల్ క్లియరెన్స్,అరైవ్–అలైవ్ థీమాటిక్ వీక్ లో భాగంగా కార్యక్రమంలో సమావేశమైన ప్రజలకు హెల్మెట్లు / సీట్ బెల్టులు ధరించడం, ట్రాఫిక్ నియమాలు మరియు రహదారి భద్రతా జాగ్రత్తలపై అవగాహన కల్పించండం, రోడ్డు భద్రతపై పౌరులతో ప్రతిజ్ఞ చేయించటం, మండల పరిధిలో గల ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చు పౌరులకు నో హెల్మెట్– నో ఎంట్రీ బోర్డులు విధిగా కార్యాలయంలో ఏర్పాటు చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, హౌసింగ్ పిడి సిద్ధార్థ, డీఈఓ అశోక్, ముఖ్య ప్రణాళిక అధికారి కిషన్, డీఏఓ శ్రీధర్ రెడ్డి, సంక్షేమ అధికారులు దయానంద రాణి , నరసింహ, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యత పాటించాలి

**భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**

**ముద్ర, భద్రాద్రి జిల్లా:**
ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మాణాలు గడువులోపు పూర్తి చేయాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశాలు జారీ చేశారు. సుజాతానగర్ మండలం మద్రి తండా లో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం సమగ్రంగా పరిశీలించారు. గ్రామంలో మొత్తం 99 ఇళ్లకు అనుమతులు మంజూరు కాగా, అందులో 65 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్ల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామంలో పలువురు లబ్ధిదారుల ఇళ్లను ప్రత్యక్షంగా సందర్శించి నిర్మాణ నాణ్యత, పనుల పురోగతిని సవివరంగా పరిశీలించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

# మెరుగైన వైద్యం అందించాలి

- **స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**
ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. బుధవారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది ఎంతమంది విధులు నిర్వహిస్తున్నారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని రిజిస్టర్లను చెక్ చేశారు. డాక్టర్లు,సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలన్నారు.



ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. ఆసుపత్రి ఆవరణలో తిరుగుతూ పేషంట్ల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా లేదా అని పేషంట్లను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో అదనపు కలెక్టర్ మాట్లాడారు. డాక్టర్లు, సిబ్బంది మంచిగా చూస్తున్నారా అని ఆరా తీశారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలను ప్రతిరోజు శుభ్ర పరచాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.



## ఘనంగా రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**
యాదాద్రి భువనగిరి జిల్లా ప్రముఖ న్యాయవాది సామ రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఆయన అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు హీరేకర్ శ్రీను ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఎండి కరీం, నరసింహ, సిలివేరు శ్రీనివాస్, సిద్ధులు తదితరులు పాల్గొన్నారు.


## అయ్యప్ప ఆలయంలో ఘనంగా విష్ పూజ

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**
శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం శబరి నగర్ ఆలయ వ్యవస్థాపక చైర్మన్ అయిత రాములు, ఆలయ ప్రధానార్చకులు నరేంద్ర శర్మ జితేందర్ తివారి ఆధ్వర్యంలో బుధవారం విష్ పూజ అంగరంగ వైభవముగా నిర్వహించారు. విష్ పూజ అంటే కేరళ మలయాళీ నూతన సంవత్సరం ప్రారంభం కేరళ సాంప్రదాయ ప్రకారం ఇక్కడ కూడా అదేవిధంగా ఉత్సవమూర్తి అయ్యప్ప స్వామికి పండ్లు కూరగాయలు నవధాన్యాలు ఆకుకూరలు కిరాణా సరుకులు డ్రై ఫ్రూట్స్ తో స్వామివారి ముందు ఉంచి పూజలు చేసి ఆ పదార్థాలన్నీ కిచిడిగా చేసి వచ్చిన భక్తులందరికీ ప్రసాదముగా అందించారు. (చిల్లర నాణాలు) అయ్యప్పస్వామి వారి ముందు ఉంచి పూజ చేసి వచ్చిన భక్తులందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు నూనె వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు గాదె శ్రీనివాస్, మంచుకొండ వినోద్, చామ రవీందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ చీకటిమల్ల రాములు, సభ్యులు పాల్గొన్నారు.



# వ్యాపార సముదాయాలకు టెండర్లు పిలవాలి

- **బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో దేవస్థాన ఈఓకి వినతిపత్రం**



**ముద్ర, యాదగిరిగుట్ట:**
యాదగిరిగుట్ట కొండపైన వ్యాపార సముదాయాలకు వెంటనే టెండర్లు పిలవాలని బీజేపీ యాదగిరిగుట్ట పట్టణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం దేవస్థానం కార్యనిర్వాహణాధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శికాదూరి అచ్చయ్య మాట్లాడుతూ.. కొండపైన 30, 40 ఏండ్ల నుండి కేవలం ఒక వర్గం చేతిలో మాత్రమే వ్యాపార సముదాయాలు ఉన్నాయని వాటిని టెండర్ వేయకుండా రాజకీయ బలంతో డబ్బు బలంతో అడ్డుకుని అతి తక్కువ కిరాయితో వర్తక సంఘం పేరుతో షాపులు నడుపుతున్నారని అన్నారు. కొండపైకి వచ్చే భక్తులను దోపిడీ చేసే విధంగా వివిధ వ్యవహారం ఉందని కొండపైన దేవస్థానం ఉద్యోగులకు రిటైర్మెంట్ ఉంది కానీ వర్తక సంఘానికి లేదని తాతలు, తండ్రులు, కొడుకులు అన్నట్టు నేటి సంఘం వారు షాపు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఆ ప్రభుత్వానికి మద్దతుగా ఉండి వాటికి లంచాలు ఎర గా వేస్తూ వీటిని రెన్యువల్ చేసుకుంటూ వస్తు కొబ్బరి కాయ 100, వాటర్ బాటిల్ 40కి అమ్ముతూ భక్తులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణం, మండలంలో కొన్ని వందల మంది నిరుద్యోగ యువకులు 10వేల జీతానికి పట్టణాలకు పోయి పని చేయాల్సిన పరిస్థితి ఇక్కడ ఉంది వీళ్లు మాత్రం సబ్ లీజ్ ల పేరుతో నెలకు 50000 తీసుకొని వీళ్ళు పబ్బం గడుపుతున్నారని ఈ వర్తక సంఘంలో నిజమైన పేదలు ఎవరన్నా ఉంటే వారికి మినహాయింపు ఇస్తాం కానీ తక్షణ సంఘాన్ని రద్దు చేసి వేలం నిర్వహించడం ద్వారా దేవస్థానానికి కొన్ని కోట్లలో ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్, పట్టణ మండలం మాజీ అధ్యక్షులు గుంటుపల్లి సత్యం, జిల్లా కౌన్సిల్ నెంబర్ ఆకుల చంద్రమౌళి, పట్టణ కార్యదర్శిలు దొమ్మాట ప్రభాకర్, ఆవుల సత్యం, ఆలేటి కర్ణ, సురేష్, సీనియర్ నాయకులు లింకలపల్లి శ్రీనివాస్, మిర్యాల కృష్ణ ,బోడ బుచ్చిబాబు, బండ కింది సాయి, సుధగని ప్రశాంత్, విజయ్, శ్రీనాథ్, శ్యామ్ పాల్గొన్నారు.



## మక్కాయాత్రికులకు ఘన సన్మానం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**
భువనగిరి పట్టణంలోని జలీల్ పుర మజీద్ కమిటీ ఆధ్వర్యంలో పవిత్ర మక్కా యాత్రకు వెళుతున్న యాత్రికులను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మజీద్ కమిటీ అధ్యక్షుడు ఇక్బాల్ చౌదరి మాట్లాడుతూ మక్కా యాత్రకు వెళుతున్న యాత్రికులకు వారు చేసే ప్రార్థనలో ఎలాంటి పొరపాటలు అవకతవకలు జరగకుండా ఉండటానికి వారికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ సభ్యులు ముస్తాఫ్ చౌదరి, అత ఉర్ రహమాన్ షకీల్ ముస్తఫా ఖాదిరి కాజమ్ అహ్మద్, షేక్ మీరా చౌదరి, సాధాక్ అలీ, ఇక్బాల్ అహ్మద్, రహీం ఉద్దీన్, మోహి ఉద్దీన్, అదిల్, సుజావుద్దీన్, ఇషాక్ పాల్గొన్నారు.



## ట్యాంక్ బండ్ వాకర్స్ కార్యవర్గ ఎన్నిక

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**
భువనగిరి ట్యాంక్ బండ్ వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గుమ్మల మల్లేశం, ఉపాధ్యక్షులు మంద నర్సింగరావు, పాక నరేష్, జి పవన్ కళ్యాణ్, కొరటూరి రామచందర్, ప్రధాన కార్యదర్శిగా పాల నరేష్, కోఆర్డినేటర్ రత్నపురం వివేక్, సహాయ కార్యదర్శి వడ్లకొండ మల్లేశం, కోశాధికారి బద్దం శ్రీనివాస్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు కొంచ విజయ్, శ్రీధర్ గౌడ్, గౌరవాధ్యక్షులుగా పూస శ్రీనివాస్, ఉదరి సతీష్ యాదవ్, గౌరవ సలహాదారు మరుగు మధు, ఎస్సై లక్ష్మణ్, 109 మంది సభ్యులచే ఏకగ్రీవంగా ఈ కమిటీని ఎన్నుకున్నారు. సంతోష్ చారి దాతచే వాకర్స్ అందరికీ టీ షర్ట్స్ అందజేశారు.



## కొండపైన ఎస్పీఎఫ్ సిబ్బందికి శిక్షణ

**ముద్ర, యాదగిరిగుట్ట:**
స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల భద్రత లక్ష్యమని ఎస్పీఎఫ్ ఇన్స్పెక్టర్ శేషగిరిరావు అన్నారు. యాదగిరిగుట్ట టీజీ ఎస్పీఎఫ్ డీజీ స్వాతి లాక్రా ఆదేశాల మేరకు, భద్రతా విభాగానికి చెందిన ఎస్పీఎఫ్ సిబ్బందికి బుధవారం కొండపైన సీపీఆర్ ఫైర్ ఫైటింగ్ అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దేవస్థానం డిఇఓ నవీన్ ఎస్సై రవికుమార్ సిబ్బంది నందు నాయక్ మురళి కురుమూర్తి పాండు శ్రీకాంత్ రెడ్డి సిద్ధులు మహేష్ అనిల్ లక్ష్మణ్ దేవస్థానం సిబ్బంది సుధాకర్ బాలరాజు హోంగార్డ్స్ విజయ్ మమత పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

**ముద్ర, తుంగతుర్తి:**
తుంగతుర్తి మండలంలో ఇటీవల ప్రారంభం చేసిన ధాన్యం కేంద్రాల్లో కొనుగోలు వెంటనే ప్రారంభించాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తాటికొండ సీతయ్య అన్నారు. బుధవారం తుంగతుర్తిలో విలేకరులతో మాట్లాడుతూ.. కొన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారని ఇంకా ప్రారంభం కాని కేంద్రాలు తక్షణమే ప్రారంభం చేయాలని అధికారులను కోరారు. వేసవి దృష్ట్యా రైతులకు మంచినీళ్లు, టెంట్ సౌకర్యం కల్పించాలని అన్నారు. రైతు కొనుగోలు కేంద్రాల్లో కానీ మిల్లుల వద్ద కానీ రైతులు దోపిడీకి గురికాకుండా ప్రభుత్వ అధికారులు ఎప్పటి కప్పుడు పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఈ సమావేశం లో జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్, మండల నాయకులు తునికి సాయిలు, గోపగాని రమేష్, గోపగాని వెంకన్న, భాస్కర్, పాల్గొన్నారు.



### వేసవి అలెర్ట్
**పెరుగు మిశ్రమం తీసుకోవాలి**

పెరుగులో చక్కెర, యాలకులు కలిపి తీసుకుంటే చలువ చేస్తుంది. కానీ షుగర్ ఉన్నవారు జాగ్రత్త.



## తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి



- కలెక్టర్ ఇలా త్రిపాఠి

<u>ముద్ర, నిజామాబాద్:</u>

జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. భీంగల్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బాల్కొండ నియోజకవర్గం పరిధిలోని ఎంపీడీవోలు, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈలు, ఎంపీవోలు, ఇతర అధికారులతో కలెక్టర్ తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సరఫరా వ్యవస్థను సమగ్రంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో నీటి ఎద్దడి రాకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ, అవసరమైన చోట యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని ఆదేశించారు. పనులు చేపట్టడానికి ముందు స్థానిక ప్రజాప్రతినిధులను సంప్రదించాలని సూచించారు. ఆయా గ్రామాల వారీగా నీటి సరఫరాను నిరంతరం సమీక్షించాలన్నారు. చేతి పంపులు, బోరు బావులకు అవసరమైన చోట తక్షణమే మరమ్మతులు చేయాలన్నారు. జూన్‌లో విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే వరకు హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లకు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నివాస ప్రాంతాలతో పాటు అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో శుద్ధి జలాలు సరఫరా అయ్యేలా చూడాన్నారు. ఎంపీవోలు, ఏఈలు నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

## నియమాలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలు నివారించాలి

- ఐజీ చంద్ర శేఖర్ రెడ్డి

<u>ముద్ర ప్రతినిధి, మెదక్:</u>

రహదారి నియమాలు పాటిస్తూ వాహనదారులు బాధ్యతతో వాహనాలు నడిపి ప్రమాదాలను సమర్థవంతంగా నివారించాలని ఐజీ చంద్ర శేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ లో జరిగిన అరైవ్-ఆలైవ్ కార్యక్రమంలో ఐజీతో పాటు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్రైవర్స్ కు ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించి, కంటి పరీక్షలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఐజీ చంద్ర శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనల పట్ల బాధ్యతాయుత ప్రవర్తనను ప్రజలు అలవాటు చేసుకోవాలని, తూప్రాన్, కాళ్లకల్ గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డే జరపాలని, 4 సంవత్సరాలు పైబడిన వయసు కలిగిన పిల్లలకు సైతం వాహనాలపై తీసుకెళ్ళే సమయంలో వారికి కూడా హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పక ధరించాల్సిన ఆవశ్యకత గురించి తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. మైనర్ లు వాహనాలు నడపకూడదని, డ్రంకెన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్ వంటి వాటి గురించి విస్తృత ప్రచారం నిర్వహిస్తూ, ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అన్నారు. స్కూల్ బస్సులు ఫిట్ నెస్ కలిగి ఉండేలా చూడాలని అన్నారు.

కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, వాహన చోదకులు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. రోడ్డుపై ప్రయాణించేటపుడు ఎదుటి వారి అజాగ్రత్తలను కూడా గమనించి ప్రయాణించాలన్నారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించాలనీ, ప్రతి సంవత్సరం దాదాపు 7000 ప్రమాదాలు జరుగుతున్నాయని, జాగ్రత్తలే ప్రమాదాల నివారణకు మార్గమన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, డీఎస్పీ లు, సర్పంచ్, ఉప సర్పంచ్, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.









## రోడ్డు భద్రతపై విద్యార్థులు, పోలీసుల ప్రతిజ్ఞ

<u>ముద్ర ప్రతినిధి, మెదక్:</u>

మెదక్ బోధన్ చౌరస్తాలో బుధవారం అరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణపై విద్యార్థులు, పోలీసులు కలిసి ప్రతిజ్ఞ చేశారు.

ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ సమాజంలో అతివేగం, అజాగ్రత్త వల్ల ఎందరో విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, నాయకుడు అంజద్, సిద్ది రాములు, ఏఎస్ఐ రుక్సానా, గిరిజన గురుకుల విద్యార్థినులు తదిత రులు పాల్గొన్నారు.





## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- అదనపు కలెక్టర్ నగేష్

<u>ముద్ర ప్రతినిధి, మెదక్:</u>

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. బుధవారం చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డే సందర్భంగా మెదక్ మండలంలోని మక్త భూపతిపూర్ లో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. నాలుగు సంవత్సరాలు పైబడిన వయసు కలిగిన పిల్లలను సైతం వాహనాల మీద తీసుకెళ్లేటప్పుడు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పక ధరించాలని అన్నారు. మైనర్లు డ్రంక్ అండ్, డ్రైవ్ ఓవర్ స్పీడ్ జోలికి పోవద్దన్నారు. ట్రాఫిక్ నిబంధనల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## గురుకుల హాస్టల్ విద్యార్థిని మృతి

- కుటుంబ సభ్యుల ఆందోళన

<u>ముద్ర, కామారెడ్డి:</u>

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి బీసీ గర్ల్స్ హాస్టల్‌లో నస్రుల్లాబాద్ మండల కేంద్రానికి చెందిన 8వ తరగతి విద్యార్థిని శ్రావణి (14) అనుమానాస్పదంగా మృతి చెందింది. బుధవారం ఉదయం 5-45 గంటలకు శ్రావణి హాస్టల్లో కింద పడిపోవడంతో తోటి విద్యార్థినులు హాస్టల్ సిబ్బందికి తెలిపారు. దీంతో హుటాహుటిన అంబులెన్స్ ద్వారా విద్యార్థిని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రి వైద్యులు విద్యార్థినిని పరీక్షించి ముందే మృతి చెందినట్లు నిర్ధారించారు. అయితే తమ కూతురు మృతి పట్ల అనుమానాలు ఉన్నాయని విచారణ జరిపించాలని ఆమె కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. గురుకుల విద్యార్థిని శ్రావణి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్ పరామర్శించారు. విద్యార్థిని మృతిపై జాజుల సురేందర్ నిరసన చేపట్టగా.. పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. తన కూతురు ఎలా చనిపోయిందో కూడా చెప్పటం లేదంటూ శ్రావణి తల్లి ఆవేదన వ్యక్తం చేస్తోంది. విద్యార్థిని చావుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించి, తల్లిదండ్రులకు న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.



## ఫీజు రాయితీలలో ధ్రువీకరణ పత్రాలు ఎంతో ముఖ్యం

- కలెక్టర్ ప్రతిమా సింగ్

<u>ముద్ర ప్రతినిధి, మెదక్:</u>

పదవ తరగతి విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం ఫీజు రాయితీలలో ధ్రువీకరణ పత్రాలు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉంటాయని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలో పదవ తరగతి విద్యార్థులకు కులం ఆదాయం, జనన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తూ కార్పొరేట్ స్థాయి ధీటుగా నాణ్యమైన గుణాత్మక విద్యను అందిస్తుందని తెలిపారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఫీజు రాయితీలలో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వెల్లడించారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా పిల్లలను విధిగా పాఠశాలకు పంపించి చదువుకునే విధంగా ప్రోత్సహించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జైచంద్రారెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంఈఓ సత్యనారాయణ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మండల సభలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 16న జరుగు 21 మండల కేంద్రాలు, 4 మున్సిపాల్టీలలో నిర్వహించనున్న సభలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. గూగుల్ మీట్ ద్వారా అధికారులకు పలు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంపొందించేందుకు ఉద్దేశించిన అరైవ్-అలైవ్ కార్యక్రమం గురించి సభల్లో తెలియజేయాలని అన్నారు. ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈ గూగుల్ మీట్ లో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, డిసిహెచ్ఎస్ శివదయాల్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్, డీఎఫ్ఓ జోజి, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, డిపిఓ యాదయ్య, ఆర్అండ్ బి ఈఈ వేణు, ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కార్యకర్తలే బీజేపీకి బలమైన పునాది

- ఎంపీ రఘునందన్‌రావు

<u>ముద్ర, సిద్దిపేట:</u>

క్రమశిక్షణతో కూడిన కార్యకర్తలే బీజేపీకి అసలైన బలమని, వారి కృషితోనే పార్టీ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ శక్తిగా ఎదిగిందని ఎంపీ మాధవనేని రఘునందన్ రావు అన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణంలో 'పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్'లో భాగంగా నిర్వహించిన శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను ఆకళింపు చేసుకోవాలని ఎంపీ సూచించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. 'వికసిత్ భారత్'లక్ష్య సాధనలో కార్యకర్తల పాత్ర కీలకమని, పోలింగ్ బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సోషల్ మీడియాను సమర్థంగా వినియోగించుకుంటూ ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధులు సారంగుల అమర్ నాథ్, కప్పర ప్రసాద్ రావు, మాజీ ఎంబీసీ ఛైర్మన్ తాడూరి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు మనోహర్ యాదవ్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ గాడిపల్లి భాస్కర్, నాయకులు యెల్లు రాంరెడ్డి, నాలాగామ శ్రీనివాస్, జస్వంత్ రెడ్డి పాల్గొన్నారు.





### డ్రంకన్ డ్రైవ్‌లో నలుగురి అరెస్ట్

<u>ముద్ర, నిజామాబాద్:</u>

ఆర్మూర్ పట్టణంలో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఆర్మూర్ ఎస్ హెచ్ఓ సత్యనారాయణ గౌడ్ బుధవారం తెలిపారు. అరెస్ట్ అయిన నలుగురిని కోర్టులో హాజరుపరచగా ఇద్దరికీ ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానాను, మరో ఇద్దరికీ 4 రోజుల సాధారణ జైలు శిక్షను జె ఎఫ్ సి ఎం న్యాయమూర్తి సరళ రాణి విధించినట్లు ఎస్ హెచ్ఓ తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి నడపరాదని, వాహనదారులకు మోటార్ వెహికల్ నూతన చట్ట ప్రకారం భారీగా జరిమానాలు, జైలు శిక్షలు పెంచడం జరిగిందని, వాహనదారులు వారి వాహనాల ధ్రువపత్రాలు వారి వెంట ఉంచుకోవాలన్నారు.

## రేషన్ షాప్ లో విజిలెన్స్, ఎన్ఫోర్స్ మెంట్ తనిఖీలు

<u>ముద్ర ప్రతినిధి, మెదక్:</u>

మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలోని ఇస్లాంపూర్ లోని రేషన్ షాప్ లో విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ టీం-2, హైదరాబాద్, జిల్లా పౌర సరఫరా అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో రేషన్ షాప్ లో ఉండాల్సిన బియ్యం కంటే 12.68 క్వింటాళ్ళ బియ్యం అధికంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సంబంధిత డీలర్ పై ఈసీ యాక్ట్-1955 నిబందనల ప్రకారం 6-ఏ కేసు నమోదు చేసినట్లు డిఎస్ఓ నిత్యానంద్ తెలిపారు.

తదుపరి రేషన్ కార్డు లబ్దిదారులకు ప్రభుత్వ రేషన్ బియ్యం పంపిణిలో ఎటువంటి ఆటంకం కలగకుండా ఉండడానికి రేషన్ షాప్ ను తూప్రాన్ మండలం దాతార్పల్లికి చెందిన రేషన్ డీలర్ మేకల ప్రవీణ్ కుమార్ కు అదనపు బాద్యతలు ఇచ్చినట్లు తెలిపారు. రేషన్ షాప్ డీలర్లు భవిష్యత్తులో ఎలాంటి అక్రమాలకు పాల్పడిన చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి నిత్యానంద హెచ్చరించారు.



## వేసవి అలెర్ట్

దానిమ్మ రసం తీసుకోవాలి

దానిమ్మ రసం శరీర వేడిని తగ్గిస్తుంది. రక్తానికి కూడా మంచిది.



## ఇసుక అక్రమ రవాణా కు చెక్ పెట్టాలి

**ముద్ర, నారాయణ పేట :** జిల్లాలో గుర్తించిన ఇసుక రీచ్ లతో పాటు రెవెన్యూ,వాటర్ షెడ్ పరిధిలోని చెక్ డ్యాంల వద్ద నుంచి ఇసుక రవాణా చేసేందుకు అనుమతులు తప్పనిసరి అని కలెక్టర్ ప్రతీక్ జైన్ స్పష్టం చేశారు. ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెట్టాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ నుంచి కలెక్టర్ అధ్యక్షతన డి.ఎల్.ఎస్.సి( డిస్టిక్ లెవెల్ స్యాండ్ కమిటీ) సమావేశం గూగుల్ మీట్ ద్వారా జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో మాగనూరు మండలంలోని 5 ఇసుక రీచ్ లు, ఉట్కూర్ మండలంలో 2, మక్తల్ లో రెండు,ధన్వాడ గోటూరు, కొత్తపల్లి, లింగాల చేడ్ రీచ్ ల నుంచి ఇసుక రవాణా కు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని మైనింగ్ ఏడి వివరించారు. గుర్తించిన ప్రాంతాల నుంచి నిబంధనల మేరకు ఇసుక రవాణా కు అనుమతులు ఇవ్వాలని, ఆయా ప్రాంతాలలో సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలన చేసి, పారదర్శక మైన నివేదికలను ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఒకరిద్దరు తహసీల్దార్ల పనితీరుపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు.

**భూగర్భ జలాలను సంరక్షించుకోవాలి**

జిల్లాలో భూగర్భ జలాలను సంరక్షించుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో భూగర్భ జల శాఖ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. వ్యవసాయానికి భూగర్భజల వనరులపై ప్రధానంగా ఆధారపడటం తగ్గించు కోవాలని పరిమితంగా వినియోగించుకోవాలని కోరారు. నీటిని సృష్టించలేం కానీ సంరక్షించుకోగలం అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని, ఇష్టారాజ్యంగా భూగర్భజలాల్ని వెలికితీయడం కాకుండా వాన నీటిని సాధ్యమైనంత వరకు భూమిలో ఎక్కువగా లోపలి ఇంకింప చేసే విషయాలపై దృష్టి పెట్టాలని నీటి సంరక్షణ మన అందరి సామాజిక బాధ్యత అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా నారాయణపేట జిల్లా క్రియాశీలక భూగర్భ జల వనరులు పుస్తకం విడుదల చేశారు.

## జేఎన్టీయూలో విద్యార్థుల మధ్య చిచ్చు



**ముద్ర, కూకట్‌పల్లి :** జేఎన్టీయూ ప్రతిష్టను దిగజారుస్తూ, విద్యార్థుల మధ్య వైషమ్యాలు సృష్టిస్తున్న చల్లా రామకృష్ణ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వివిధ విద్యార్థి సంఘాలు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశాయి. స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం, బంజార విద్యార్థి సంఘం, జేఏసీ, బిఆర్ఎస్వి నాయకులు మాట్లాడుతూ రామకృష్ణ రెడ్డి తన రాజకీయ స్వప్రయోజనాల కోసం అమాయకపు మొదటి సంవత్సరం విద్యార్థులను వాడుకుంటున్నారని ఆరోపించారు. చిన్న విషయాలను పెద్దవి చేసి విద్యార్థులపై తప్పుడు కేసులు పెట్టించడం, కేసులను వెనక్కి తీసుకోకుండా బెదిరించడం, విద్యార్థులను వ్యసనాలకు బానిసలుగా మార్చి వారి జీవితాలతో ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత, గిరిజన విద్యార్థుల పట్ల కుల వివక్ష చూపుతున్నారని, ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ఉన్నా ఆగడాలు కొనసాగుతున్నాయని నాయకులు పేర్కొన్నారు. వర్సిటీలో రాజకీయ అనుబంధ సంఘాల జోక్యం లేకుండా చూడాలని, వెంటనే రామకృష్ణ రెడ్డి పీహెచ్‌డీ అడ్మిషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు దిలీప్, భాను ప్రకాశ్, సాయి విశ్వగ్న తదితరులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ డ్రైవ్ లో 150 మంది ఎంపిక

**ముద్ర, మల్కాజిగిరి:** మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ, కళాశాల ప్లేస్‌మెంట్ సెల్, మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ డ్రైవ్ ను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బండి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలని కోరారు. ఈ డ్రైవ్‌లో హెటిరో, లైరోస్, నవతా ట్రాన్స్‌పోర్ట్ వంటి సుమారు 20 ప్రముఖ బహుళజాతి కంపెనీలు పాల్గొన్నాయి. వివిధ విభాగాలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. 150 మంది విద్యార్థులను ప్రతిభను బట్టి ప్రాథమికంగా ఎంపిక చేసుకున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. కళాశాల కెరీర్ గైడెన్స్ , ప్లేస్మెంట్ ఆఫీసర్, డా. ఎస్ రాజేశ్ కుమార్ వైస్ ప్రిన్సిపల్ డా అడవి రాజు, అకడమిక్ కోఆర్డినేటర్ గుణాకర్, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ప్రతినిధి ఇస్మాయిల్ పాల్గొన్నారు.

## గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారుడికి సన్మానం



**ముద్ర, తాండూర్:** అంతర్జాతీయ స్థాయిలో భారత జెండాను ఎగరవేసిన యువ క్రీడాకారుడు మోహిజ్‌కు తాండూర్ పట్టణంలోని అక్షర పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించడం జరిగింది. తాండూర్ పట్టణానికి చెందిన యువ క్రీడాకారుడు మోయిజ్ నేపాల్ దేశ రాజధాని ఖాట్మండు నగరంలో నిర్వహించిన అంతర్జాతీయ షూటింగ్ బాల్ పోటీలలో భారత జట్టు తరపున ప్రాతినిధ్యం వహించిన మోహిజ్, అద్భుత ప్రతిభ కనబరచి జట్టుకు విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించి గోల్డ్ మెడల్ సాధించాడు. మొత్తం ఐదు మ్యాచ్‌లలో భారత జట్టు విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. ప్రిన్సిపాల్ మోహన కృష్ణ గౌడ్ మాట్లాడుతూ మోహిజ్ సాధించిన విజయం కేవలం అతని వ్యక్తిగత విజయమే కాదని, రాష్ట్రానికి గర్వకారణమన్నారు. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని, దేశానికి మరిన్ని పతకాలు అందించాలని ఆశిస్తున్నామని అన్నారు. పాఠశాల యాజమాన్యం ప్రవీణ్కుమార్, శ్రీకాంత్ కులకర్ణి, రవీందర్ రెడ్డి, యూనస్, శోభా రాణి పాల్గొన్నారు.

## ఎంపీ ఎదుటనే నేతల మధ్య మాటల యుద్ధం

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** గద్వాలలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్లో చేరిక సందర్భంగా ఇద్దరు నేతల మధ్య మాటల యుద్ధం జరిగినట్లు తెలిసింది. బీఆర్ఎస్ కౌన్సిలర్ తో పాటు నాయకులు, కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి సరిత సమక్షంలో చేరేందుకు సిద్ధమయ్యారు. దీంతో గద్వాలలోని డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి సమక్షంలో చేరాలని కోరడంతో అందుకు నియోజకవర్గం ఇన్‌చార్జ్, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరిత నిరాకరించింది. డీసీసీ కార్యాలయంలో పీఏసీ సమావేశం ముగిసిన వెంటనే అందరూ అక్కడికి వెళ్లారు. అక్కడి చేరుకున్న డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి చేరికలకు ఇది వేదిక కాదని, ప్రజా బంగ్లాలలో చేరికలు చేపట్టాలని కోరారు. అందుకు సరిత నిరాకరించింది. కొంతసేపు వారు ఒకరి పై ఒకరు ఘాటుగా విమర్శించుకున్నట్లు తెలిసింది. పరిస్థితి చేజారిపోయేలా ఉందని గ్రహించిన నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి ఇద్దరిని శాంతింపజేసేలా యత్నించారు. చివరిగా సరిత నివాసంలోనే చేరికలు జరగడం గమనార్హం.

## అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

**ముద్ర, కాప్రా:** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానాస్పద పరిస్థితుల్లో ఓ గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందడం కలకలం రేపింది. మాణిక్ సాయి ఎన్‌క్లేవ్, కందిగూడ ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి 32 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు గల ఓ వ్యక్తి స్పృహలేకుండా పడిపోయి ఉన్నట్లు స్థానికులు గమనించి, 100 నంబర్‌కు సమాచారం అందించగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అంబులెన్స్ సాయంతో ఆసుపత్రికి తరలించగా, వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని గాంధీ హాస్పిటల్ మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై నీలం రంగు టీ-షర్ట్, నలుపు రంగు జీన్స్ ప్యాంటు ఉండగా, మెడలో నలుపు రంగు పూసల దండ ధరించి ఉన్నాడు. ఎవరైనా గుర్తుపట్టగలిగితే వెంటనే కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు.

# టీడీపీలో కార్యకర్తనే అధినేత


### ఏపీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రావు



**ముద్ర, అమరావతి:** తెలుగుదేశం పార్టీలో కార్యకర్తనే అధినేత అని నూతనంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన పల్లా శ్రీనివాస్ రావు అన్నారు. సామాన్య కార్యకర్తకు కూడా జాతీయ, రాష్ట్ర స్థాయి బాధ్యతలు ఇచ్చే ఏకైక పార్టీ టీడీపీ అని మరోసారి రుజువైంది. సామాన్య మండల అధ్యక్షురాలిని, క్లస్టర్ ఇంఛార్జీలను పార్టీలో అత్యున్నత కమిటీ అయిన పొలిట్ బ్యూరోలో స్థానం కల్పించడం హర్షణీయం. అట్టడుగు వర్గాలకు, బీసీలకి రాజకీయంగా అండగా నిలబడటం ఒక్క టీడీపీకే సాధ్యమన్నారు. ఒక బీసీ బిడ్డగా తనకు ఈ స్థాయి గుర్తింపు లభించిందంటే అది చంద్రబాబు దూరదృష్టి అని, బీసీల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. తనపై నమ్మకంతో మరోసారి రాష్ట్ర అధ్యక్ష పదవి అప్పగించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా, సీనియర్ల అనుభవాన్ని గౌరవిస్తూనే, యువతను ప్రోత్సహిస్తూ పార్టీని భవిష్యత్ తరాలకు ఒక తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతామని అన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన యువనేత నారా లోకేష్ కు శుభాకాంక్షలు తెలిపారు. తన అసాధారణ పనితీరుతో చెక్కుచెదరని సంకల్పంతో అటు పార్టీ క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని, ఇటు యువతరాన్ని ఏకతాటిపైకి తెచ్చిన లోకేష్ నియామకం టీడీపీ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమన్నారు. నాయకత్వం అంటే కేవలం పదవి కాదని, అంకితభావంతో కూడిన బాధ్యత అని నిరూపించిన ఆయన, రాబోయే రోజుల్లో పార్టీని మరిన్ని విజయ తీరాలకు చేర్చడం ఖాయమన్నారు. నూతన టీడీపీ జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

# పరిగి భూసేకరణ ఆపేవరకు ఉద్యమిస్తాం

- అమాయక రైతుల నోటికాడి బుక్క లాక్కోవద్దు
- కలెక్టర్ స్పష్టమైన హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తాం
- వికారాబాద్ ఆర్డీవో ఆఫీస్ ఎదుట కల్వకుంట్ల కవిత, విశారదన్ మహరాజ్ ధర్నా, అరెస్టు
- నడిఎండలో నాలుగు గంటలకు పైగా బైఠాయింపు టారం పోలీస్ స్టేషన్ కు తరలింపు
- పోలీసుల ఓవరాక్షన్
- కవరేజీకి వెళ్లిన మీడియా ప్రతినిధులు కెమెరాలు లాక్కున్న పోలీసులు



**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** పరిగి ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అమాయక రైతుల భూములు లాక్కునేందుకు కుట్రలు చేస్తోందని.. బలవంతపు భూసేకరణ ఆపేవరకు ఉద్యమం కొనసాగిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. పరిగి మండలం కళ్లాపూర్, రాపోల్, భట్ల చందారం గ్రామాల్లో భూసేకరణకు నిరసనగా ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్, బాధిత రైతులతో కలిసి బుధవారం వికారాబాద్ ఆర్డీవో ఆఫీస్ ఎదుట ధర్నా చేశారు. నాలుగు గంటలకు పైగా నడిఎండలో బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతుల భూములు తీసుకుంటూ వారి నోటి కాడి బుక్క లాక్కుంటోందని మండిపడ్డారు. రైతుల భూములు లాక్కుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పాపానికి ఆ పార్టీని కాల్చి బూడిద చేసినా పాపం లేదన్నారు. కళ్లాపూర్, రాపోల్, భట్ల చందారం సహా పలు గ్రామాల్లో రైతుల మొత్తం భూములను తీసుకొని వారికి దిక్కులేని పరిస్థితి తీసుకొస్తున్నారని మండిపడ్డారు. ఇక్కడి రైతుల బాధ రాష్ట్రం మొత్తానికి తెలియాలన్న ఉద్దేశంతోనే వికారాబాద్ లో ఆందోళన చేపట్టామన్నారు. పరిశ్రమల పేరుతో ప్రభుత్వం సేకరించనున్న 1250 ఎకరాల్లో వెయ్యి ఎకరాలు అసైన్డ్ భూములేనని, మిగతా 250 ఎకరాల భూమి కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులవేనని చెప్పారు. ఏళ్ల క్రితం ఇచ్చిన భూములను లాక్కోవటమంటే వారి పొట్ట కొట్టటమేనని విమర్శించారు. ఈ కాంగ్రెస్ మూడేళ్ల పాలనలో రైతులు ఎక్కడ కూడా సంతోషంగా లేరన్నారు. ఒక వైపు మూసీ బాగు చేస్తానని చెబుతున్న ముఖ్యమంత్రి, మరో వైపు మూసీ నెత్తిన పరిశ్రమలు తెచ్చిపెడతానని అంటున్నాడని విమర్శించారు. పరిశ్రమల కాలుష్యాన్ని మళ్లీ మూసీలోకి తరలిస్తారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ రైతుల పట్ల ఎలా వ్యవహరించిందో అంతకన్నా దారుణంగా కాంగ్రెస్ వ్యవహరిస్తుందన్నారు. పెద్ద రైతుల జోలికి పోకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులనే ఈ ప్రభుత్వం టార్గెట్ చేసిందన్నారు. భూములు ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా లేకపోయినప్పటికీ బలవంతంగా వారి నుంచి భూములు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులకు అన్యాయం జరగనివ్వమన్నారు. ఎక్కడ రైతులకు అన్యాయం జరిగితే అక్కడ జాగృతి, ధర్మ సమాజ్ పార్టీ ఉంటుందన్నారు. ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములు కోల్పోతున్న రైతుల సమస్యపై కలెక్టర్తో మాట్లాడారు. ఆందోళన విరమించాలని నచ్చచెప్పేందుకు కలెక్టర్ స్వయంగా కవితకు ఫోన్ చేశారు. ఐతే బాధిత రైతుల సమస్యలను కలెక్టర్ స్వయంగా వినాలని ఆమె కోరారు. రైతులు భూములు ఇచ్చేందుకు సిద్ధంగా లేరని స్పష్టం చేశారు. ప్రభుత్వం తీసుకోవాలనుకుంటున్న భూములన్నీ కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులవేనని గుర్తు చేశారు. వారందరి దగ్గరకు కలెక్టర్ వెళ్లి వారి అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుంటేనే ఆందోళన విరమిస్తామని చెప్పారు. దీనిపై ఆర్డీవో తో మాట్లాడుతానంటూ కలెక్టర్ స్పష్టమైన హామీ ఇవ్వలేదు. దీంతో కవిత, విశారదన్ ఆందోళన కొనసాగించారు. పోలీసుల ఓవరాక్షన్ రైతుల భూముల విషయంలో ఆందోళనకు దిగిన కవిత, విశారదన్ పట్ల పోలీసులు ఓవరాక్షన్ చేశారు. వారిని బలవంతంగా అరెస్ట్ చేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో తోపులాట జరిగింది. పోలీసుల తీరుపై కవిత, విశారదన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కవిత, విశారదన్ ను అరెస్ట్ చేసి బంటారం స్టేషన్కు తరలించారు. అటు రైతుల ఆందోళనలో జర్నలిస్టుల, రైతుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. కెమెరాలు లాక్కొని జర్నలిస్టులను నెట్టేశారు.

# రోడ్డు భద్రతపై అందరికీ అవగాహన ఉండాలి

### జీడిమెట్ల ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ కె.వెంకట్ రెడ్డి




**ముద్ర, కుత్బుల్లాపూర్ :** రోడ్డు భద్రతపై అందరికీ అవగాహన ఉండాలని జీడిమెట్ల ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ కె. వెంకట్ రెడ్డి అన్నారు. "అరైవ్ అలైవ్" ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని శిఖర ఇంటర్నేషనల్ స్కూల్, బౌరంపేట్లో నిర్వహించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు, హెల్మెట్ స్ట్రాప్ సరిగా ధరించకపోతే జరిగే ప్రమాదాలు, సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, సీట్ బెల్ట్ వినియోగం వంటి అంశాలపై వీడియోలను ప్రదర్శిస్తూ అవగాహన కల్పించడం జరిగింది. అదేవిధంగా రోడ్డు ప్రమాదాలకు గురైన విద్యార్థులతో మాట్లాడి వారు చేసిన తప్పులను మరియు వారి అనుభవాలను మిగతా విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. పోస్ట్ కార్డులను విద్యార్థులకు అందజేసి, వారు తమ తల్లిదండ్రులకు ట్రాఫిక్ నియమాలు పాటించాలని లేఖలు రాయడం ద్వారా వాటిని వారి చిరునామాలకు పోస్టు చేయాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కె. వెంకట్ రెడ్డి, ప్రిన్సిపాల్ హేమలత పాల్గొన్నారు.

**రోడ్డు భద్రతే జీవన రక్ష**

**ముద్ర కూకట్‌పల్లి:** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కూకట్పల్లి జెనెసిస్ స్కూల్‌లో బుధవారం కూకట్పల్లి పోలీసుల ఆధ్వర్యంలో ఆరైవ్ ఆలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సదస్సుకు కూకట్పల్లి అదనపు డీసీపీ సుదర్శన్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు, యువతకు దిశానిర్దేశం చేశారు. త్వరగా బయలుదేరండి నిమ్మదిగా వెళ్లండి, సురక్షితంగా చేరండి అనే సూత్రాన్ని పాటించాలని కోరారు. జుట్టు రాలిపోతుందనే చిన్నపాటి అపోహతో హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని హెచ్చరించారు. మానవ ప్రాణం ఎంతో అమూల్యమైనది. మీపై ఆధారపడిన కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వాహనాలు నడపాలి నేటి కాలంలో విద్యార్థులు, యువత ఎక్కువగా రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని, అందుకే వారిలో మార్పు తీసుకురావడానికి ఇలాంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులతో పాటు ఎస్ హెచ్ ఓ , ట్రాఫిక్ ఎస్ హెచ్ ఓ, పోలీసు అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

### మహానగరాన్ని జల్లెడ పట్టి..

## మైనర్ బాలికను కాపాడారు

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** పోలీసింగ్ అంటే కేవలం టెక్నాలజీ కాదు.. అది నిబద్ధత, పట్టుదల, బాధ్యత. ఈ సత్యాన్ని మరోసారి గద్వాల్ పోలీసులు నిరూపించారు. ఎలాంటి టెక్నికల్ ఎవిడెన్స్ లేకుండా, గద్వాల పట్టణంలో మాయమైన మైనర్ బాలికను మహానగరమైన హైదరాబాద్‌లో క్షేమంగా గుర్తించి రక్షించారు. ఈనెల9న గద్వాల్ పట్టణంలో తల్లి మాటలకు అలిగిన కూతురు (ఒక మైనర్) ఇంటిని వదిలివెళ్లింది, తల్లిదండ్రులు ఆవేదనతో పోలీసులను ఆశ్రయించారు. ఎస్పీ టి. శ్రీనివాసరావు దిశానిర్దేశంలో స్పెషల్ టీం రంగంలోకి దిగింది. సీఐ టంగుటూరి శ్రీను నాయకత్వంలో ఎస్సై కళ్యాణ్ కుమార్, పీసీలు చంద్రయ్య, కిరణ్ కుమార్, రామకృష్ణ బృందం ఒక్క క్షణం కూడా వృథా చేయకుండా ఆచూకీ కోసం పరిగెత్తింది. మొదట ఎలాంటి ఆధారాలు లేకపోయినా, గద్వాల్ బస్సు డ్రైవర్ చెప్పిన చిన్న లీడ్‌ను కూడా పెద్ద క్లూగా మలచడం, అక్కడి నుంచి మహానగరం హైదరాబాద్‌లో మొదలైన ఆపరేషన్ ఒక యుద్ధంలా మారింది. మొబైల్ ట్రేస్ లేదు, డిజిటల్ ఆధారాలు లేవు, ఎక్కడ ఉందో తెలియదు, అయినా వెనక్కి తగ్గని పోలీస్ బృందం ఒక ఇంచు వదలకుండా అన్ని ప్రదేశాలను కలయతిరుగుతూ నిద్ర, విశ్రాంతి లేకుండా వెతికారు. దరాబాద్‌లో లోకల్ పోలీసుల సహకారంతో సీసీ కెమెరాలను గంటల తరబడి పరిశీలిస్తూ, చిన్న కదలికలను కూడా వదలకుండా విశ్లేషిస్తూ చివరకు గమ్యం చేరుకున్నారు. అఫ్జల్ గంజ్ బస్టాండ్ పరిసరాల్లో కనిపించగానే, పోలీస్ బృందం మెరుపువేగంతో స్పందించి అక్కడికి చేరుకుని బాలికను క్షేమంగా అదుపులోకి తీసుకుంది. ఈ టీమ్‌ను ఎస్పీ శ్రీనివాసరావు అభినందిస్తూ వారి కృషి పోలీస్ శాఖకు గర్వకారణమన్నారు.


# గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

### సిఎంసి కమిషనర్ జి సృజన




**ముద్ర, శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి జోన్ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారంపై సిఎంసి కమిషనర్ జి.సృజన బుధవారం జోనల్ కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, యూబీడీ, యూసీడీ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనులన్నింటినీ 99 రోజుల ప్రోగ్రాం లో భాగంగా జూన్ 2, 2026 లోపు పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. కనీసం 190 పనులను ఈ గడువులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. జోన్‌లోని అన్ని రోడ్లకు ఎండ్-టు-ఎండ్ కార్పెటింగ్ చేయాలని, ఎక్కడా గుంతలు లేకుండా మరమ్మతులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే రోడ్లపై ఉన్న ఆక్రమణలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఏప్రిల్ చివరి నాటికి జోన్ అంతటా పూడికతీత పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వీధి దీపాల సమస్యలపై అసిస్టెంట్ ఇంజనీర్లు తక్షణమే స్పందించాలని, ప్రజల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. క్రీడా ప్రాంగణాలు, పార్కులు, కమ్యూనిటీ హాళ్లు వంటి ప్రభుత్వ ఆస్తుల పూర్తి సమాచారాన్ని సేకరించాలని, ఖాళీ స్థలాలకు 10 రోజుల్లోపు హద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపు మే చివరి నాటికి పూర్తి కావాలని, దోమల నివారణకు 10 రోజులకు ఒకసారి ప్రతి ప్రాంతంలో ఫాగింగ్, స్ప్రేయింగ్ జరిగేలా షెడ్యూల్ రూపొందించాలని కమిషనర్ తెలిపారు. జంక్షన్ల సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకోసం కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత నిధులను వినియోగించుకోవాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, విభాగాల మధ్య సమన్వయంతో పనిచేస్తూ లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రతి వారం సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

**వేసవి అలెర్ట్:**



మజ్జిగ తాగడం అలవాటు చేసుకోవాలి. మజ్జిగలో నిమ్మరసం, ఉప్పు కలిపి తాగితే ఎలక్ట్రోలైట్స్ బ్యాలెన్స్ అవుతాయి.

# టార్గెట్ పోలవరం..

- నీటి భద్రత కోసం జలధార యాక్షన్ ప్లాన్
- పోలవరం నీటి వినియోగంపై ముందే ప్రణాళిక
- నేరడి బ్యారేజ్, చింతలపూడి మెయిన్ కెనాల్‌కు త్వరలో టెండర్లు
- జూన్ చివరి కల్లా వెలిగొండ స్టేజ్ 1 పనులు పూర్తి కావాలి
- జల వనరుల శాఖ పై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



**ముద్ర, అమరావతి:**
సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో పోలవరం ప్రాజెక్టు సహా రాష్ట్ర జల వనరుల అభివృద్ధిపై కీలక నిర్ణయాలు తీసుకోబడ్డాయి. నీటి భద్రతను లక్ష్యంగా చేసుకుని "జలధార యాక్షన్ ప్లాన్" రూపొందించాలని సీఎం ఆదేశించారు. పోలవరం పూర్తి కాగానే గోదావరి జలాలను కుడి, ఎడమ కాలువల ద్వారా సమర్థంగా వినియోగించేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షిస్తూ, వెలిగొండ స్టేజ్-1 పనులను జూన్ చివరి నాటికి పూర్తి చేయాలని, చింతలపూడి మెయిన్ కెనాల్, నేరడి బ్యారేజ్‌కు త్వరలో టెండర్లు పిలవాలని స్పష్టం చేశారు. అలాగే ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు, వంశధార-నాగావళి, నాగావళి-చంపావతి అనుసంధాన పనుల్లో వేగం పెంచాలని అధికారులకు సూచనలు ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సీఎం భావిస్తున్నారు. హోటళ్లు, షాపింగ్ ప్రాంతాలు, బోటింగ్ సౌకర్యాలతో పాటు వాటర్, రాక్, ఫారెస్ట్ థీమ్‌లతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఇక భూగర్భ జలా ల పెంపుపై చేపట్టిన చర్యల ఫలితంగా ఈ ఏడాది నీటి నిల్వలు పెరిగినట్లు అధికారులు వెల్లడించారు. జలధార-జలహారతి కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో నీటి వనరుల అభివృద్ధికి చర్యలు కొనసాగుతున్నాయి. మొత్తం మీద పోలవరం ప్రాజెక్టును కేంద్రంగా చేసుకుని రాష్ట్ర జల వనరుల సమగ్ర వినియోగానికి ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోంది.

# నామినేటేడ్ షురూ

- కాంగ్రెస్ నేతలకు పదవుల జాతర
- నామినేటెడ్ పోస్టుల భర్తీకి సన్నాహాలు పూర్తి



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో గత కొద్దిరోజులుగా నెలకొన్న అంతర్గత పరిణామాలు, పాలనాపరమైన నిర్ణయాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం తన నివాసంలో అత్యంత కీలకమైన సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ , టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఈ భేటీలో పాల్గొన్నారు. దాదాపు నాలుగు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రభుత్వ పథకాల అమలులో సమన్వయం, నామినేటెడ్ పదవుల భర్తీపై ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. ఈ భేటీలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న అంశం నామినేటెడ్ పదవుల భర్తీ . గత కొంతకాలంగా పార్టీ కోసం కష్టపడిన సీనియర్ నాయకులు, ద్వితీయ శ్రేణి కార్యకర్తలు పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. మరో రెండు రోజుల్లోనే పెండింగ్‌లో ఉన్న కీలకమైన నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు తెలుస్తోంది. సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ ప్రాతినిధ్యం దెబ్బతినకుండా జాబితాను సిద్ధం చేయాలని సీఎం పార్టీ నేతలకు సూచించారు. ఇది కార్యకర్తలలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని అధిష్టానం భావిస్తోంది.

**అసంతృప్తి స్వరాలపై ఆరా తీసిన మీనాక్షి**

పార్టీలో అక్కడక్కడా వినిపిస్తున్న అసంతృప్తి స్వరాలపై కూడా మీనాక్షి నటరాజన్ ఈ సందర్భంగా ఆరా తీశారు. కొందరు సీనియర్ నేతలు ప్రభుత్వ నిర్ణయాలపై బహిరంగంగా చేస్తున్న వ్యాఖ్యలు, సమన్వయ లోపంపై చర్చించారు. అందరినీ కలుపుకుని వెళ్లాలని, జిల్లాల వారీగా పార్టీ నేతలతో నిరంతరం టచ్‌లో ఉండాలని టీపీసీసీ అధ్యక్షుడికి సీఎం సూచించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో పార్టీ కేడర్ క్రియాశీలకంగా వ్యవహరించాలని ఈ సమావేశం నిర్ణయించింది.

**గ్రేటర్ ఎన్నికలపైనా చర్చ**

దీనితో పాటు, రాబోయే గ్రేటర్ ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసే దిశగా వ్యూహరచన చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాల అమలు తీరును, లబ్ధిదారుల అభిప్రాయాలను పార్టీ యంత్రాంగం సేకరించాలని చర్చించారు. పార్టీ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ కేడర్ నుంచి అందుతున్న ఫీడ్‌బ్యాక్‌ను సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వానికి, పార్టీకి మధ్య గ్యాప్ లేకుండా చూసేందుకు క్రమం తప్పకుండా ఇటువంటి సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఈ భేటీలో తీర్మానించారు.

**రెండు రోజుల్లో పదవుల జాబితా**

రేవంత్ రెడ్డి నివాసంలో జరిగిన ఈ ముక్కోణపు భేటీ తెలంగాణ కాంగ్రెస్‌లో సరికొత్త మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది. నామినేటెడ్ పదవుల భర్తీతో పాటు, పార్టీలోని అంతర్గత విభేదాలకు చెక్ పెట్టి.. రాబోయే ఎన్నికలకు క్యాడర్‌ను సమరోత్సాహంతో సిద్ధం చేయడమే ఈ సమావేశం ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. ఇప్పటికే లిస్ట్ సిద్ధమైందని, ఏ క్షణమైనా ప్రకటన వచ్చే అవకాశం ఉందని గాంధీ భవన్ వర్గాలు ధృవీకరిస్తున్నాయి.

# హైదరాబాద్‌లో 'ఎల్.పీఎల్' ప్రారంభం



**ముద్ర, హైదరాబాద్:**
అమెరికాకు చెందిన ప్రముఖ వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థ ఎల్.పీఎల్ ఫైనాన్షియల్ భారత్‌లో తన విస్తరణకు మరో కీలక అడుగు వేసింది. హైదరాబాద్ నగరంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను అధికారికంగా ప్రారంభించింది. ఈ కేంద్రం ద్వారా సంస్థ గ్లోబల్ టెక్నాలజీ, ఆవిష్కరణలు, నిర్వహణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేయనుంది. హైదరాబాద్‌లో ఉన్న ప్రతిభావంతుల సమృద్ధి, ఐటీ మౌలిక సదుపాయాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ టెక్నాలజీల్లో ఉన్న నైపుణ్యం ఈ కేంద్ర స్థాపనకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఈ జీసీసీ ద్వారా టెక్నాలజీ, డేటా అనలిటిక్స్, రిస్క్ మేనేజ్‌మెంట్, ప్రోడక్ట్ డెవలప్‌మెంట్ వంటి కీలక విభాగాలకు మద్దతు అందించనున్నారు. ప్రారంభ కార్యక్రమంలో తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్ బాబు పాల్గొని, హైదరాబాద్‌ను గ్లోబల్ ఫైనాన్షియల్ ఇన్నోవేషన్ హబ్‌గా తీర్చిదిద్దడంలో ఇటువంటి పెట్టుబడులు కీలకమని పేర్కొన్నారు. నానక్‌రాంగూడలో తాత్కాలికంగా ప్రారంభమైన ఈ కేంద్రం, 2027 నాటికి శాశ్వత కార్యాలయానికి మారే ప్రణాళికలో ఉంది.

# అంతర్ రాష్ట్ర ధాన్యం చెక్ పోస్ట్ ప్రారంభం




**మహాదేవపూర్, ముద్ర:**
కాళేశ్వరం వద్ద ఏర్పాటు చేసిన అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టును బుధవారం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్ ప్రారంభించారు. తర రాష్ట్రాల నుంచి ధాన్యం అక్రమ రవాణాను పూర్తిగా అడ్డుకునే దిశగా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ రాములు, ఎస్ఐ తమాషా రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్రీజ, సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్లు సురేందర్ రెడ్డి, రాజు, గ్రామ పరిపాలన అధికారి శ్యామ్ పాల్గొన్నారు.

# వారసత్వ సంపదను కాపాడుకుంటాం

- మంత్రి జూపల్లి కృష్ణారావు



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
తెలంగాణలోని చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపదను కాపాడుతూ వాటిని పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. బుధవారం ఆయన గోల్కొండ జోన్‌లో పర్యటిస్తూ పలు అభివృద్ధి పనులను సమీక్షించారు.కుతుబ్ షాహీ టూంబ్స్ వద్ద జరుగుతున్న ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్ పనులను పరిశీలించిన మంత్రి, పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అలాగే గోల్కొండ కోట నుంచి టూంబ్స్ వరకు రోప్‌వే నిర్మాణ ప్రతిపాదనలపై ఆరా తీశారు.

అనంతరం కటోరా హౌస్ ను సందర్శించి, దాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. పరిసర ప్రాంతాల్లో శుభ్రత చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. గోల్కొండ సమీపంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కూడా సూచించారు.ఖజానా బిల్డింగ్ మ్యూజియం అభివృద్ధిపై కూడా మంత్రి దృష్టి సారించారు. చారిత్రక కళాఖండాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణలో ఉన్న చారిత్రక, ప్రకృతి సంపదను దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులకు పరిచయం చేయడంతో పాటు మౌలిక వసతులను మెరుగుపరచడంపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీటీడీసీ ఎండీ గౌతమి, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రహదారి భద్రత - అందరి బాధ్యత

- మంత్రి పొన్నం ప్రభాకర్



**బోథ్, ముద్ర:**
రహదారి భద్రత – అందరి బాధ్యత అని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలనా– ప్రగతి ప్రణాళిక లో భాగంగా నిర్వహించిన అరైవ్– అలైవ్, రహదారి భద్రత అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రహదారి నిబంధనలు పాటించడం కేవలం చట్టం కోసం కాదని, అది మన ప్రాణాలకు రక్షణ కవచమని తెలిపారు. ట్రాఫిక్ నియమాలపై సమాజంలో అవగాహనా పెంపొందించడంలో విద్యార్థుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. దేశంలో సహజ మరణాల కంటే, రోడ్డు ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోతున్న వారే ఎక్కువగా ఉండటం ఆవేదన కలిగించే అంశమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం నాలుగు ప్రధాన అంశాలపై దృష్టి సారించిందని చెప్పారు. ప్రజల్లో అవగాహన కల్పించడం, రహదారుల నిర్మాణం, లోపాల సవరణ, నిబంధనల కఠినంగా అమలు చేయడం, ప్రమాదం జరిగిన వెంటనే వైద్యం అందించేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా 25 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు గల వారు అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్ రూట్ ప్రయాణం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించడం వల్ల ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అంతకు ముందు స్టేడియం మైదానంలో పాఠశాల విద్యార్థులతో కలిసి మంత్రి హెల్మెట్ – సేవ్ లైవ్స్ ఆకారంలో భారీ మానవ హారాన్ని నిర్వహించారు. విద్యార్థులు రహదారి భద్రతపై నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం నింపారు. అనంతరం యువతకు లెర్నింగ్ లైసెన్సులు, డ్రైవర్లకు ఉచితంగా కళ్లద్దాలను మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి అంబేద్కర్ చౌక్ వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీని మంత్రి ప్రారంభించడమే కాకుండా, స్వయంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఆదిలాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు పాయల శంకర్, వెడ్మ బొజ్జు పటేల్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ మల్లెపూల నర్సయ్య, ఇంచార్జి కలెక్టర్ యువరాజు మర్మాట్, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ స్రవంతి, రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ పి. రవీందర్ కుమార్, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. శ్రీనివాస్, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్ స్పెక్టర్ హరీంద్ర కుమార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# లౌకికవాదం కొనసాగాలంటే డీఎంకే–కాంగ్రెస్ కూటమిని గెలిపించాలి

- తమిళనాడులో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ముద్ర, హైదరాబాద్:** తమిళనాడులో లౌకికవాదాన్ని కాపాడాలంటే డీఎంకే–కాంగ్రెస్ కూటమిని గెలిపించాలని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల పరిశీలకుడిగా రాష్ట్రంలో ప్రచారం నిర్వహిస్తున్న ఆయన, విభజన రాజకీయాలకు చెక్ పెట్టేందుకు ప్రజలు ముందుకు రావాలని అన్నారు.కోయంబత్తూరు పరిసరాల్లో రోడ్‌షోలో పాల్గొన్న అనంతరం శివకాశిలో జరిగిన సభలో మాట్లాడిన మంత్రి, సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయెన్స్ ప్రజల మద్దతుతో బలంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నాయకత్వాన్ని ప్రశంసిస్తూ, కూటమి అధికారంలోకి వస్తే ఉద్యోగాల కల్పన, మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు.రాహుల్ గాంధీ నాయకత్వంపై దేశవ్యాప్తంగా ఆశలు ఉన్నాయన్నారు.

# టీడీపీలో కీలక శక్తిగా లోకేష్

- టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియామకం
- పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీల ప్రకటన



**ముద్ర, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. నారా లోకేష్‌కు తెలుగుదేశం పార్టీలో ప్రమోషన్ లభించింది. పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆయనను జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. టిడిపి జాతీయ, రాష్ట్ర కమిటీలను ప్రకటించింది. 29 మంది సభ్యులతో పొలిట్ బ్యూరో, 31 మంది సభ్యులతో జాతీయ కమిటీ, 185 మంది సభ్యులతో రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేసింది. ఏపీ టిడిపి అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు కొనసాగనున్నారు.జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు నాయుడు కొనసాగుతుండగా, కింజరాపు రామ్మోహన్ నాయుడు తదితరులు జాతీయ ప్రధాన కార్యదర్శులుగా నియమితులయ్యారు. అలాగే పలువురికి జాతీయ ఉపాధ్యక్షులు, అధికార ప్రతినిధులుగా అవకాశాలు కల్పించారు. పార్టీలో యువ నాయకత్వానికి ప్రాధాన్యం పెరిగిందని, రానున్న రాజకీయాలకు టిడిపి కొత్త దిశగా అడుగులు వేస్తోందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
12.04.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**వేసవి అలెర్ట్ : నిమ్మరసం పానీయం తాగాలి**

నిమ్మరసం, ఉప్పు, చక్కెర కలిపి తాగితే వెంటనే శక్తి వస్తుంది. వేసవిలో ఇది బెస్ట్ డ్రింక్.





## పంజాబ్ మ్యాచ్‌కు రోహిత్ అందుబాటులోనా?..
### ఫిట్‌నెస్‌పై తుది నిర్ణయం ఈరోజే

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ముంబై ఇండియన్స్ స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ పంజాబ్ కింగ్స్‌తో జరిగే కీలక మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడా లేదా అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. ఇటీవల ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో కండరాల నొప్పితో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన రోహిత్‌కు నిర్వహించిన స్కానింగ్‌లో పెద్ద గాయం ఏమీ లేదని వైద్యులు తెలిపారు.
గాయం తీవ్రత తక్కువగా ఉన్నప్పటికీ, అతడిని వెంటనే బరిలోకి దింపాలా లేదా ఒక మ్యాచ్ విశ్రాంతి ఇవ్వాలా అనే అంశంపై ముంబై జట్టు మేనేజ్‌మెంట్ ఆలోచిస్తోంది. ఈరోజు జరిగే ప్రాక్టీస్ సెషన్‌లో రోహిత్ ఫిట్‌నెస్‌ను పరిశీలించిన తర్వాత తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.
ఒకవేళ పూర్తి స్థాయిలో ఫీల్డింగ్ చేయలేని పరిస్థితి ఉంటే, రోహిత్‌ను ఇంపాక్ట్ ప్లేయర్‌గా వినియోగించే అవకాశాన్ని కూడా జట్టు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్లేఆఫ్స్ ఆశలు నిలుపుకోవాలంటే పంజాబ్‌తో మ్యాచ్ ముంబైకు కీలకంగా మారిన నేపథ్యంలో రోహిత్ అందుబాటు జట్టుకు పెద్ద బలంగా మారనుంది.

## రూ.500 కోసం కోచ్‌కు అబద్ధం చెప్పిన సాకిబ్..

ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:
ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున అద్భుత ప్రదర్శనతో గుర్తింపు పొందిన యువ పేసర్ సాకిబ్ హుస్సేన్ జీవిత ప్రయాణం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాజస్థాన్ రాయల్స్‌పై తన తొలి మ్యాచ్‌లోనే నాలుగు వికెట్లు తీసి సాకిబ్ సంచలనం సృష్టించాడు.
ఈ స్థాయికి చేరుకునే ముందు సాకిబ్ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఒకసారి కేవలం రూ.500 కోసం టెన్నిస్ బాల్ మ్యాచ్ ఆడేందుకు వెళ్లాలని భావించి, తన కోచ్‌కు అబద్ధం చెప్పిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. ప్రయాణానికి కూడా డబ్బులు లేక స్నేహితుల సహాయం తీసుకున్న అతనికి సరైన షూలు కూడా లేని పరిస్థితి ఎదురైంది. తల్లి నగలు అమ్మి మరీ అతని క్రికెట్ కలను నిలబెట్టినట్లు తెలుస్తోంది. ఎన్నో కష్టాలు ఎదుర్కొని ఐపీఎల్ వేదికపై మెరిసిన సాకిబ్ భవిష్యత్తులో భారత జట్టుకు కీలక బౌలర్‌గా ఎదుగుతాడని విశ్లేషకులు భావిస్తున్నారు.

## సూర్యకుమార్ యాదవ్ ఫామ్‌పై ఆందోళన.. కెప్టెన్సీకి ముప్పు సంకేతాలు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఇటీవలి కాలంలో పేలవమైన ఫామ్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. టీ20 ప్రపంచకప్ విజయానంతరం కూడా అతని వ్యక్తిగత బ్యాటింగ్ ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేకపోవడం బీసీసీఐకి ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 2026 సీజన్‌లో కూడా పరుగుల వేటలో వెనుకబడటం చర్చనీయాంశంగా మారింది. ఇదే పరిస్థితి కొనసాగితే కెప్టెన్సీ బాధ్యతలపై ప్రభావం పడే అవకాశముందని క్రీడా వర్గాల్లో చర్చ జరుగుతోంది.
ఇక భవిష్యత్ టోర్నీలను దృష్టిలో పెట్టుకుని బీసీసీఐ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా 2028 టీ20 ప్రపంచకప్, ఒలింపిక్స్‌ను లక్ష్యంగా పెట్టుకుని కొత్త నాయకత్వంపై ఆలోచనలు మొదలయ్యాయని తెలుస్తోంది. కోచ్ మద్దతు ఉన్నప్పటికీ, ఆటగాడిగా సూర్యకుమార్ యాదవ్ తన ఫామ్‌ను తిరిగి పొందడం ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది.
త్వరలో జరిగే ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలు సూర్యకు కీలకంగా మారనున్నాయి. ఈ సిరీస్‌లలో మంచి ప్రదర్శన చేస్తేనే అతని నాయకత్వం కొనసాగుతుందని భావిస్తున్నారు. ఒకవేళ మార్పులు అవసరమైతే, వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్‌తో పాటు శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్ వంటి ఆటగాళ్ల పేర్లు కూడా కెప్టెన్సీ రేసులో వినిపిస్తున్నాయి.

## రూ.25 కోట్ల గ్రీన్‌పై సెహ్వాగ్ ఆగ్రహం..

- కేకేఆర్ నిర్ణయంపై ఘాటు విమర్శలు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐపీఎల్ 2026 సీజన్‌లో వరుస పరాజయాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కోల్‌కతా నైట్ రైడర్స్‌పై మాజీ భారత ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తీవ్ర విమర్శలు గుప్పించాడు. ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్‌ను భారీ ధరకు కొనుగోలు చేయడం జట్టు చేసిన పెద్ద తప్పు అని వ్యాఖ్యానించాడు.
గ్రీన్ బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ ఆశించిన స్థాయిలో రాణించకపోవడం జట్టుకు భారంగా మారిందని సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. అతని స్థానంలో టీమ్ సీఫెర్ట్‌కు అవకాశం ఇవ్వాలని సూచించాడు. భారీ మొత్తాన్ని ఖర్చు చేసినప్పటికీ గ్రీన్ నుంచి సరైన ఫలితాలు రావడం లేదని విమర్శించాడు.
ఇటీవల చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ 32 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. 193 పరుగుల లక్ష్యాన్ని ఛేధించలేకపోవడంతో జట్టుకు ఇది వరుసగా నాలుగో పరాజయంగా నమోదైంది. ఇప్పటివరకు ఐదు మ్యాచ్‌లు ఆడిన కేకేఆర్ ఒక్క విజయాన్ని కూడా నమోదు చేయకపోవడం జట్టు పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చింది.
ఈ నేపథ్యంలో జట్టు ఎంపికలపై, ముఖ్యంగా భారీ ధరలకు కొనుగోలు చేసిన ఆటగాళ్ల ప్రదర్శనపై తీవ్ర చర్చ సాగుతోంది. సెహ్వాగ్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.





## రీల్ కోసం చేసిన ప్రయత్నం..


**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
సోషల్ మీడియా రీల్స్ కోసం యువత ఎంతటి సాహసాలకైనా వెనుకాడటం లేదనే మరో ఘటన వెలుగులోకి వచ్చింది. సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్ మ్యాచ్ సందర్భంగా ఓ యువతి రీల్ తీసే ప్రయత్నంలో తన ఖరీదైన బంగారు ఉంగరాన్ని పోగొట్టుకుంది.
మ్యాచ్ జరుగుతున్న సమయంలో ఆ యువతి తన చేతిలో ఉన్న ఉంగరాన్ని చూపిస్తూ వీడియో తీస్తుండగా, అది అనుకోకుండా వేలి నుంచి జారి గ్యాలరీ కింద పడిపోయింది. ఉంగరం విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని సమాచారం. వెంటనే వెతికినా రద్దీ కారణంగా అది దొరకకపోవడంతో ఆమె తీవ్ర ఆవేదనకు గురైంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కొందరు నెటిజన్లు రీల్స్ కోసం ఇలాంటి ప్రమాదకర చర్యలు చేయకూడదని సూచిస్తుండగా, మరికొందరు యువత మరింత జాగ్రత్తగా ఉండాలని అభిప్రాయపడుతున్నారు. రద్దీ ప్రదేశాల్లో విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలనే హెచ్చరికగా ఈ ఘటన నిలిచింది.



## కేకేఆర్ వరుస పరాజయాలపై శ్రీకాంత్ ఆగ్రహం..

- రింకు సింగ్‌పై సంచలన వ్యాఖ్యలు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఐపీఎల్ 2026 సీజన్‌లో కేకేఆర్ జట్టు వరుస పరాజయాలతో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఇప్పటివరకు ఆడిన ఐదు మ్యాచ్‌లలో ఒకటి వర్షం కారణంగా రద్దు కాగా, మిగిలిన నాలుగు మ్యాచ్‌లలో ఓటమి చవిచూసింది. ఈ పరిస్థితిపై మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే ప్రదర్శన కొనసాగితే ఈ సీజన్‌లో ముందుగా టోర్నీ నుంచి నిష్క్రమించే జట్టుగా కేకేఆర్ మారే అవకాశముందని హెచ్చరించారు.
రింకు సింగ్ ప్రదర్శనపై కూడా శ్రీకాంత్ విమర్శలు గుప్పించారు. గతంలో ఒకసారి అద్భుత ప్రదర్శన చేసిన కారణంతో ఇప్పటికీ అతడిని ఫినిషర్‌గా కొనసాగిస్తున్నారని, కానీ ఆ పాత్రకు తగ్గ ఫలితాలు ఇవ్వడం లేదని అభిప్రాయపడ్డారు. అధిక రన్‌రేట్ అవసరమైన సమయంలో ఒత్తిడిని ఎదుర్కోవడంలో రింకు సింగ్ తడబడుతున్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు.
ఇక గ్రీన్, రహానే వంటి ఆటగాళ్ల ప్రదర్శన కూడా ఆశించిన స్థాయిలో లేకపోవడం జట్టుకు మరింత ఇబ్బందిగా మారుతోందని శ్రీకాంత్ పేర్కొన్నారు. జట్టు తక్షణమే తమ లోపాలను సరిదిద్దుకోకపోతే టోర్నీలో మరిన్ని కష్టాలు తప్పవని సూచించారు.



## హైదరాబాద్ మ్యాచ్‌కు ధోనీ వస్తాడా?..
### ఫిట్‌నెస్ టెస్ట్‌పై ఉత్కంఠ

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
చెన్నై సూపర్ కింగ్స్ మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీ తన ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు సమాచారం. ఇటీవల కాలి కండరాల గాయం కారణంగా జట్టుకు దూరమైన ధోనీ దాదాపు కోలుకున్నట్లు తెలుస్తోంది. గురువారం జరగనున్న తుది ఫిట్‌నెస్ పరీక్ష అనంతరం ఆయన హైదరాబాద్‌కు ప్రయాణిస్తారా లేదా అన్నదానిపై స్పష్టత రానుంది. ధోనీ జట్టులోకి తిరిగి వస్తే చెన్నైకు అది పెద్ద బలంగా మారనుంది.
ధోనీ గైర్హాజరీలో సంజూ శామ్సన్ వికెట్ కీపింగ్ బాధ్యతలు నిర్వర్తించినప్పటికీ, ధోనీ తిరిగి వస్తే వికెట్ల వెనుక ఆయన అనుభవం జట్టుకు మరింత ఉపయోగపడనుంది. అంతేకాకుండా కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు మైదానంలో ఆయన ఇచ్చే సూచనలు జట్టు విజయాల్లో కీలకంగా మారే అవకాశముంది. ఇటీవలి ఐపీఎల్ సీజన్లలో ధోనీ ఫినిషర్‌గా కూడా మంచి ప్రదర్శన కొనసాగించాడు. అధిక స్ట్రైక్ రేట్‌తో కీలక పరుగులు సాధిస్తూ జట్టుకు అవసరమైన వేగాన్ని అందించాడు. ప్రస్తుత సీజన్‌లో చెన్నై మధ్యతరగతి బ్యాటింగ్ బలోపేతానికి ఆయన రాక ముఖ్యమని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.
ఇక చెన్నై జట్టు ఇటీవల ఢిల్లీ, కోల్‌కతా జట్లపై విజయాలు సాధించి మంచి ఊపులో ఉంది. అదే జోష్‌తో ఏప్రిల్ 18న హైదరాబాద్‌లో సన్‌రైజర్స్ జట్టును ఎదుర్కోనుంది. ఈ మ్యాచ్‌కు ధోనీ అందుబాటులో ఉంటారా లేదా అన్నదానిపై అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
16.04.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## వేసవి అలెర్ట్ : ధనియాల నీరు తాగాలి

రాత్రి నానబెట్టిన ధనియాల నీరు ఉదయం తాగితే శరీర వేడి తగ్గుతుంది. సహజ కూలింగ్ ఇస్తుంది.



# తిమ్మరాజుపల్లి టీవీ బెంచ్ మార్క్ గా నిలుస్తుంది






**ముద్ర, సినిమా డెస్క్:**

నూతన ప్రతిభను ప్రోత్సహించే లక్ష్యంతో హీరో కిరణ్ అబ్బవరం నిర్మిస్తున్న 'తిమ్మరాజుపల్లి టీవీ' సినిమా ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. సుమైర స్టూడియోస్‌తో కలిసి కేఏ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రంలో సాయి తేజ్, వేద జలంధర్ హీరోహీరోయిన్లుగా పరిచయం అవుతుండగా, వి.మునిరాజు దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే పీరియాడిక్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా చిత్ర బృందం మాట్లాడుతూ సినిమా గ్రామీణ జీవనశైలి, పాతకాలపు సంప్రదాయాలను గుర్తు చేసేలా ఉంటుందని తెలిపారు. నటీనటులు, సాంకేతిక నిపుణులు కలిసి ఎంతో కష్టపడి పనిచేసినట్లు, ప్రేక్షకులకు వినోదంతో పాటు మంచి అనుభూతిని అందించే చిత్రంగా ఇది నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. నిర్మాత కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ చిన్న బడ్జెట్‌తోనూ నాణ్యమైన చిత్రాన్ని రూపొందించామని తెలిపారు. 'తిమ్మరాజుపల్లి టీవీ' చిన్న చిత్రాలకు బెంచ్ మార్క్‌గా నిలిచేలా రూపొందించామని, ప్రేక్షకులు థియేటర్లలో చూసి ఆదరించాలని కోరారు.

# స్టైలిష్ లుక్‌లో ప్రగ్య జైస్వాల్



ముద్ర, సినిమా డెస్క్:

టాలీవుడ్ నటి ప్రగ్య జైస్వాల్ మోడలింగ్ రంగం నుంచి సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి 'మిర్చి లాంటి కుర్రాడు' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. అనంతరం పలు తెలుగు చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది.

సోషల్ మీడియాలో చురుకుగా ఉండే ఈ నటి తరచూ తన ఫోటోలను అభిమానులతో పంచుకుంటోంది. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో రంగురంగుల స్టైలిష్ దుస్తుల్లో తీసుకున్న కొన్ని ఫోటోలను షేర్ చేసింది. విభిన్న పోజులతో, చిరునవ్వుతో ఆకట్టుకున్న ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# అనుమానాలను నిజం చేసిన పెద్ది

**ముద్ర, సినిమా డెస్క్:**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న 'పెద్ది' సినిమా విడుదల తేదీలో మార్పు చోటుచేసుకుంది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని భావించినప్పటికీ, అనివార్య కారణాల వల్ల సినిమా విడుదలను వాయిదా వేస్తున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది.

తాజా నిర్ణయం ప్రకారం ఈ చిత్రాన్ని జూన్ నెలలో విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయించినట్లు సమాచారం. పోస్ట్ ప్రొడక్షన్ పనులు, VFX పనులను మరింత మెరుగ్గా పూర్తి చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఫిలిం నగర్ వర్గాల్లో చర్చ సాగుతోంది.

రామ్ చరణ్ కెరీర్‌లో ఈ చిత్రం ప్రతిష్టాత్మకంగా ఉండటంతో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదనే ఉద్దేశంతో విడుదలను వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో రామ్ చరణ్ కొత్త మాస్ లుక్‌లో కనిపించనున్న నేపథ్యంలో సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటించే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# బరి ప్రాక్టీస్‌లో గాయపడ్డ వరుణ్ తేజ్..

**ముద్ర, సినిమా డెస్క్:**

మెగా హీరో వరుణ్ తేజ్ ప్రస్తుతం నిహారిక కొణిదెల నిర్మాణంలో రూపొందుతున్న 'బరి' చిత్రంలో నటిస్తున్నారు. వాలీబాల్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ స్పోర్ట్స్ డ్రామా కోసం ఆయన ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నారు. హైదరాబాద్‌లో కోచ్‌ల పర్యవేక్షణలో ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో డైవ్ చేస్తూ మోకాలికి గాయమైనట్లు తెలిసింది. గాయంతో వెంటనే ఆసుపత్రికి తరలించగా, వైద్యులు సర్జరీ అవసరమని సూచించినట్లు సమాచారం. ఈ విషయాన్ని నిహారిక సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. సర్జరీ విజయవంతంగా పూర్తైందని, ప్రస్తుతం వరుణ్ తేజ్ వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నట్లు తెలిపింది.

వైద్యుల సూచనల ప్రకారం ఆయనకు కనీసం రెండు వారాల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని తెలిసింది. మోకాలి శస్త్రచికిత్స కారణంగా కొంతకాలం కదలికలపై పరిమితులు ఉండనున్నాయి. ఫిజియోథెరపీ పూర్తయ్యాకే మళ్లీ సాధారణంగా నడిచే అవకాశం ఉందని సమాచారం.

ఈ గాయంతో 'బరి' చిత్ర షూటింగ్ తాత్కాలికంగా వాయిదా పడినట్లు టాక్ వినిపిస్తోంది. షూటింగ్ తిరిగి ప్రారంభం కావడానికి



మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. గతంలో కూడా పాత్రల కోసం ప్రత్యేకంగా శ్రమించిన వరుణ్ తేజ్, ఇప్పుడు వాలీబాల్ క్రీడాకారుడి పాత్ర కోసం శిక్షణ తీసుకుంటూ గాయపడటం అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది.



# విష్ణుప్రియకు కలిసి వచ్చిన నెగెటివ్ ఫీడ్‌బ్యాక్

**ముద్ర, సినిమా డెస్క్:**

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ విష్ణుప్రియ చుట్టూ ఇటీవల ఏర్పడిన వివాదాలు, కేసులు ఆమెకు ఆర్థికంగా లాభం చేకూర్చినట్లు కనిపిస్తున్నాయి. సాధారణంగా వివాదాలు కెరీర్‌పై ప్రభావం చూపుతాయని భావిస్తారు. అయితే విష్ణుప్రియ విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా మారినట్లు చర్చ జరుగుతోంది. వివాదాలకు ముందు ఆమెకు సుమారు 1,892 మంది పెయిడ్ సబ్‌స్క్రైబర్లు ఉండగా, ఒక్కో సబ్‌స్క్రిప్షన్ ధర రూ.380గా లెక్కిస్తే నెలకు దాదాపు రూ.7 లక్షల వరకు ఆదాయం వచ్చినట్లు తెలుస్తోంది. అప్పట్లో ఆమె ఫాలోయింగ్ పరిమితంగానే ఉండేది. అయితే కేసులు నమోదైన తర్వాత సోషల్ మీడియాలో ఆమెపై విస్తృత చర్చ జరగడంతో, ఆమె కంటెంట్ చూడాలనే ఆసక్తి నెటిజన్లలో పెరిగింది. దీంతో పెయిడ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 1,892 నుంచి 4,832కు పెరిగినట్లు సమాచారం. సబ్‌స్క్రైబర్ల సంఖ్య పెరగడంతో ఆదాయం కూడా గణనీయంగా పెరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె నెలకు రూ.18 లక్షలకుపైగా సంపాదిస్తున్నట్లు అంచనా వేస్తున్నారు. నెగెటివ్ ప్రచారం కూడా కొన్నిసార్లు ఆర్థిక లాభాలకు దోహదపడుతుందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

# అర్ధరాత్రి ఫోన్ చేసి ఒప్పించాడు

- **కయాదు లోహర్**

ముద్ర, సినిమా డెస్క్:

తన అందం, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న కాయాదు లోహర్ తాజాగా ఓ ప్రైవేట్ ఆల్బమ్‌తో మరోసారి వార్తల్లో నిలిచింది. వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఆమె 'పళవ మల్లి' అనే పాటలో నృత్యంతో ఆకట్టుకుంది. 'డ్యూడ్' చిత్రంతో సంగీత దర్శకుడిగా గుర్తింపు పొందిన సాయి అభ్యంకర్ ఈ పాటకు స్వరాలు అందించారు.

తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ పాటలో అవకాశం ఎలా వచ్చిందో కాయాదు లోహర్ వివరించింది. ఒక రోజు అర్ధరాత్రి సమయంలో సాయి అభ్యంకర్ ఫోన్ చేసి పాట గురించి వివరించారని తెలిపింది. ఆ సమయంలో కాల్ రావడంతో ఆశ్చర్యపోయానని, అనంతరం ఆయన పాట వినిపించగా బాగా నచ్చడంతో వెంటనే అంగీకరించినట్లు చెప్పింది.

పాటకు ఒప్పుకోవడం సులభంగా అనిపించినప్పటికీ, దాని కోసం చాలా శ్రమించాల్సి వచ్చిందని వెల్లడించింది. ఒకవైపు రిహార్సల్స్ నిర్వహిస్తూ, మరోవైపు సినిమా షూటింగ్‌లను సమన్వయం చేయాల్సి వచ్చిందని తెలిపింది. కొన్ని సందర్భాల్లో రాత్రి 2 గంటల వరకు చిత్రీకరణ జరిగినట్లు పేర్కొంది.

ఈ పాట అద్భుతంగా రావడానికి మొత్తం బృందం కష్టపడిందని, ఆ కృషికి ఫలితంగా ఇప్పుడు ఈ పాటకు మిలియన్లలో వ్యూస్ లభిస్తున్నాయని కాయాదు లోహర్ వివరించింది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad500013.Published at H. No. 63569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com